నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 11-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:197 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

హేలగ-శకలమ్మునకు-మ
లాలా నామమ్ము నిడిన రమ్యాత్ములకున్
చాలగ నాశీస్సులనిడి
పాలిత కింకరు డభవుడు భద్రత నొసగున్ !!

(11-4-2015 ఒక గ్రహశకలానికి మలాలా పేరు పెట్టిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

నిలబెడితే రాష్ట్రాన్ని
నిండ ముంచి వేస్తున్నరా
ప్రభుత్వం పడగొడితే
ప్రజలంతా చూస్తున్నరా
గతం నేడు నిజమేమిటో
గమనించు కదా జనం
విమర్శల్లో ప్రతి ఒక్కరి
విలువ తూకమేయు ఘనం

-వేల్పుల నారాయణ
9440433475

యంగ్ ఇండియా నా బ్రాండ్

-ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు
-ప్రతి నియోజకవర్గంలో రెసిడెన్షియల్ స్కూల్
-సైనిక్ స్కూల్‌కు దీటుగా పోలీస్ స్కూల్
-యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ప్రారంభించిన ముఖ్యమంత్రి
-వంద కోట్ల కార్పస్ ఫండ్‌కు సహకరించాలి
-కార్పొరేట్ కంపెనీలకు సీఎం రేవంత్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 10:ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని, అలాగే యంగ్ ఇండియా తన బ్రాండ్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలోని గ్రేహౌండ్ క్యాంపస్ సమీపంలోని యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ.. 2 కిలో బియ్యం.. ఎన్టీఆర్ బ్రాండ్ అని, హైదరాబాద్‌లో ఐటీ.. చంద్రబాబు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని, అలాగే రైతు బాంధవుడిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి బ్రాండ్ సంపాదించుకున్నారని, ఈ రోజు తాను క్రియేట్ చేసిన తన బ్రాండ్ యంగ్ ఇండియా అన్నారు.

మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసినట్టు సీఎం తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని గుర్తు చేశారు. ఆనాడు పండిట్ జవహర్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీల పునాదులు పడ్డాయని, నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరిందన్నారు. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారు.. కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారన్నారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయని సీఎం గుర్తు చేశారు.

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్..

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని సీఎం అన్నారు. అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది తమ బ్రాండ్ అన్నారు. నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆనంద్ మహీంద్రాను యూనివర్సిటీకి చైర్ పర్సన్‌గా నియమించుకున్నామని చెప్పారు. ఈ రోజు యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉందని, దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు.

ప్రీ స్కూల్ విధానం అమలు..

ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని సీఎం అన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోందన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రీస్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

సైనిక్ స్కూల్‌కు దీటుగా పోలీస్ స్కూల్..

సైనిక్ స్కూల్ కు దీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చి దిద్దుతామని సీఎం అన్నారు. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. పోలీస్ స్కూల్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అన్నారు. సామాజిక బాధ్యతగా ప్రైవేటు కంపెనీలు పోలీస్ స్కూల్ కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలీస్ స్కూల్ కోసం ?100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రతీ పోలీస్ సిబ్బందికి ఇది అత్యంత ముఖ్యమైందన్నారు.

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వడగళ్ల వాన కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, భూపాలపల్లి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో గురువారం మధ్యాహ్నం నగరమంతా చల్లని వాతావరణం ఏర్పడింది. ఉక్కపోత నుంచి నగర ప్రజలకు ఉపశమనం కలిగింది. వారం రోజుల క్రితం వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అయ్యాయి. మళ్లీ ఇవాళ కాస్త ఎండలు నెమ్మదించాయి.మియాపూర్, మదీనాగూడ, చందానగర్, లింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి, మేడ్చల్, దుండిగల్, గండిమైసమ్మ, బహదూర్‌పల్లి, గగిల్లాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం వాన దంచికొట్టింది. దీంతో ఆయా ప్రాంతాల్లో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

తెలంగాణ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి..

-మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 10:తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానంతో దేశంలో ఎక్కడ లేని విధంగా ఆతిథ్య రంగంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ముంబయి పోవై లేక్‌లో జరిగిన దక్షిణాసియా 20వ హోటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ప్రఖ్యాత హోటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో మంత్రి జూపల్లి ప్రత్యేకంగా సమావేశమై తెలంగాణ ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

పీపీపీ విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు.

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా తెలంగాణను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, హెరిటేజ్, మెడికల్, వెల్ నెస్ టూరిజాన్ని అభివృద్ధి చేసేలా నూతన పర్యాటక విధానాన్ని రూపొందించామని వివరించారు. రాష్ట్రంలో 2030 నాటికి రూ. 15 వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ, 3 లక్షల ఉద్యోగాల కల్పన, రెట్టింపు వృద్ధి, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ఆధారంగా తెలంగాణను దేశంలో మొదటి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా నిలపాలనే ఆశయంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు .

ఒక్కసారిగా చల్లబడ్డ నగరం

హైదరాబాద్, ఏప్రిల్ 10:హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. అనేక ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. హైదరాబాద్ నగరంలో ఉదయం నుంచే వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం చిరుజల్లు కురిసింది. మియాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్, గాగిల్లాపూర్, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, జుబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది.

గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు తదితర జిల్లాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

తెలంగాణ రాష్ట్రానికి భారీ హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 10: తెలంగాణకు భూకంప హెచ్చరిక భయాందోళనకు గురిచేస్తోంది. రామగుండంలో భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూకంప తీవ్రత గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. ఆ భూకంప తీవ్రత హైదరాబాద్, అలాగే అమరావతి వరకు కూడా ఉంటుందని అంటున్నారు. తెలంగాణకు భూకంపం వచ్చే అవకాశం ఉందని ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండం సమీపంలో భారీ భూకంపం సంభవించి అవకాశం ఉందని.. ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని అందులో పేర్కొంది.

అయితే ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ సంస్థ భూకంపం సూచనలను ఎవరూ కూడా ధృవీకరించని పరిస్థితి. ప్రభుత్వ వర్గాలు గానీ, శాస్త్రీయ సంస్థలు ఎవరూ ధృవీకరించడం లేదు. భూకంపాలను కచ్చితంగా ముందస్తుగా అంచనా వేయడం ప్రస్తుతం శాస్త్రీయంగా సాధ్యం కాదని, ఇలాంటి సూచనలు తరచుగా నిర్ధారణకు నోచుకోవని అధికారులు చెబుతున్న మాట. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పెసిఫిక్ జోన్ రెండు, మూడులో ఉన్నాయి. ఇవి తక్కువ నుంచి మోస్తారు భూకంప ప్రమాదాన్ని మాత్రమే సూచిస్తాయి. గతంలో ఈ ప్రాంతంలో కొన్ని చిన్న చిన్న భూకంపాలు సంభవించాయి. అవి ఏమాత్రం నష్టం కలిగించలేదు.

రామగుండం పరిసర ప్రాంతాల్లో భారీ భూకంపం సంభవించే అవకాశం ఉందని అధికారిక సమాచారం. అయితే భూకంపాల విషయంలో అప్రమత్తంగా ఉండటం మంచిదే. కానీ నిర్ధారణలేని సమాచారంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఐఎండీకి సంబంధించిన అధికారులు చెబుతున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో గతంలో చిన్న నుంచి మోస్తారు తీవ్రత గల భూకంపాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఎర్త్‌క్వేక్ వెబ్ సైట్ మాత్రం రామగుండం సమీపంలో భూకంప ప్రమాదం వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతోంది.

ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో భూకంపాల రికార్డు కూడా పెద్దగా లేదు. కొద్ది సందర్భాల్లో స్వల్ప భూకంపాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. 1969 ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతంలో 5.1 తీవ్రత గల భూకంపం వచ్చింది. అది అప్పట్లో రాష్ట్రాన్ని బాగా ఊపేసిందని చెప్పొచ్చు. ఆ తరువాత 1998లో తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా 4.5 తీవ్రతతో ప్రకంపనలు నమోదు అయ్యాయి. అలాగే హైదరాబాద్‌లో 1984, 1999, 2013లో చిన్న భూకంపాలు మాత్రమే సంభవించగా... ప్రజలు ఒక్కసారిగా భయపడిపోయారు. కానీ ఎలాంటి ఆస్తి నష్టం కూడా సంభవించలేదు. అలాగే శ్రీశైలం డ్యాం పరిసరాల్లో కొన్ని సందర్భాల్లో భూమి కంపించినట్లు రికార్డు అయ్యాయి. అయితే భూకంపాలు రాకను కచ్చితంగా అంచనాలు వేయడం ఇప్పటికీ శాస్త్రీయంగా సాధ్యం కాదు కాబట్టి భద్రతా చర్యలు తీసుకోవడం మంచిది. తెలుగు రాష్ట్రాల్లో భారీ భూకంపాలు సంభవించనప్పటికీ ప్రకృతి ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పడం కష్టం కాబట్టి అప్రమత్తంగా ఉండటం మంచిదన్నది అధికారుల మాట.

నేటి నుండి తెలంగాణ అమరనాథ్ యాత్ర ప్రారంభం

అచ్చంపేట, ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : చుట్టూ అడవి.. కొండలు.. కోనలు.. జలపాతాలు.. ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే నల్లమల అటవీ ప్రాంతంలో దట్టమైన లోయ గుహలో వెలసిన లింగమయ్య దర్శనం పూర్వజన్మసుకృతంగా భావిస్తారు. అలాంటి సలేశ్వరం జాతర ఉత్సవాలు శుక్రవారము నుండి ప్రారంభం కానున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే పరమేశ్వరుని మహాదర్శన భాగ్యం రానేవచ్చింది. ఈ నెల11 నుంచి 13 వరకు జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు అడవిలోకి అనుమతి ఇవ్వనున్నట్లు అటవీశాఖ అధికారులు ప్రకటించారు. ఉత్సవాలకు సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు వివిధ రాష్ట్రాల నుండి లింగమయ్య స్వామివార్లను దర్శించుకునేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నది. ఈ జాతరను సాహసోపేత తెలంగాణ అమరనాథ్ యాత్రగా పిలుస్తారు.

మార్క్ శంకర్ ఆరోగ్యంపై చిరు ట్వీట్ !

హైదరాబాద్, ఏప్రిల్ 10:సింగపూర్‌లో చదువుతున్న పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. దీంతో పవన్ కళ్యాణ్, చిరంజీవి, చిరంజీవి భార్య మార్క్ శంకర్ ని చూడటానికి సింగపూర్ వెళ్లారు. గత మూడు రోజులుగా మార్క్ శంకర్ హాస్పిటల్ లోనే ఉండి చికిత్స తీసుకున్నాడు.

మార్క్ శంకర్ గత మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నాడు. అయితే పవన్ కళ్యాణ్, చిరంజీవి, చిరంజీవి భార్య సురేఖ మార్క్ శంకర్ ని చూడటానికి సింగపూర్ వెళ్లారు. కాగా, తాజాగా మెగాస్టార్ చిరంజీవి తన తమ్ముడు పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ ఆరోగ్యం గురించి ట్వీట్ చేశారు.

''మా బిడ్డ మార్క్ శంకర్ ఇంటికొచ్చేసాడు. అయితే ఇంకా కోలుకోవాలి. మా కులదైవమైన ఆంజనేయ స్వామి దయతో, కృపతో త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో, మళ్ళీ మామూలుగా ఎప్పటిలానే వుంటాడు.

రేపు హనుమత్ జయంతి, ఆ స్వామి ఓ పెద్ద ప్రమాదం నుంచి, ఓ విషాదం నుంచి ఆ పసి బిడ్డని కాపాడి మాకు అండగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆయా ఊళ్ళల్లో, ఆయా ప్రాంతాల్లో మార్క్ శంకర్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ మా కుటుంబానికి అండగా నిలబడి మా బిడ్డ కోసం ప్రార్థనలు చేస్తున్నారు, ఆశీస్సులు అందచేస్తున్నారు. నా తరపున, తమ్ముడు కళ్యాణ్ బాబు తరపున, మా కుటుంబం యావన్మంది తరపున మీ అందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నాం" అంటూ చిరు తన ట్వీట్ లో పేర్కొన్నాడు.

మహావీర్ జయంతి సందర్భంగా భగవాన్ మహావీర్‌కు ప్రధానమంత్రి నివాళులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:మహావీర్ జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా భగవాన్ మహావీర్‌కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులర్పించారు. భగవాన్ మహావీర్ సదా అహింసకూ, సత్యానికీ, కరుణకూ ప్రాధాన్యాన్నిచ్చారనీ, ఆయన ఆదర్శాలు ప్రపంచవ్యాప్తంగా ఎందరో ప్రజలకు శక్తిని ప్రసాదిస్తున్నాయనీ శ్రీ మోదీ అన్నారు. ప్రాకృత భాషకు ప్రభుత్వం కిందటేడాది ప్రాచీన భాష హోదాను ఇచ్చిందనీ, ఈ నిర్ణయానికి ప్రశంసలు లభించాయనీ ఆయన అన్నారు.

"ఎక్స్"లో ప్రధాని ఒక సందేశాన్ని పొందుపరుస్తూ ఇలా పేర్కొన్నారు:

''మనమందరం భగవాన్ మహావీర్‌కు ప్రణామం చేద్దాం. అహింస, సత్యం, కరుణ ముఖ్యమని ఆయన చెప్పేవారు. ఆయన ఆదర్శాలు ప్రపంచమంతటా అసంఖ్యాక మంది ప్రజలకు శక్తినిస్తున్నాయి. ఆయన బోధనలను జైన సముదాయం చక్కగా సంరక్షించడంతోపాటు బహుళ ప్రజాదరణకు పాత్రమయ్యేటట్లు శ్రద్ధ వహించింది. వారు భగవాన్ మహావీర్ నుంచి ప్రేరణను పొంది, జీవనంలోని విభిన్న రంగాల్లో రాణించడమే కాకుండా సామాజిక శ్రేయానికి తమ వంతు తోడ్పాటును కూడా అందించారు.

భగవాన్ మహావీర్ కన్న కలలను నిజం చేయడానికి మా ప్రభుత్వం సదా కృషి చేస్తూ ఉంటుంది. కిందటి సంవత్సరం, మేం ప్రాకృత భాషకు ప్రాచీన హోదాను ఇచ్చాం... ఈ నిర్ణయానికి సర్వత్రా ప్రశంసలు లభించాయి."

మధురానగర్‌లో పేలుడు పదార్థాల అక్రమ రవాణా

కరీంనగర్, ఏప్రిల్ 8: కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో పేలుడు పదార్థాల అక్రమ రవాణా కలకలం సృష్టించింది. ఎస్సై వంశీకృష్ణ కథనం ప్రకారం.. కరీంనగర్ వైపు నుండి జగిత్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జగిత్యాల నుండి కరీంనగర్ వెళ్తున్న ఓ తప్పుడు నంబర్ గల ఆటో మధురానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని జగిత్యాల కరీంనగర్ జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు ముందు భాగం దెబ్బతినగా, ఆటో డ్రైవర్ పారిపోయాడు.ఆర్టీసీ బస్సు డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆటోను తనిఖీ చేయగా కాటన్ బాక్స్, రెండు సంచులలో 600 జిలెట్టిన్ స్టిక్స్, డి కార్డు వైర్ బండిల్ దొరికినట్లు, వీటి విలువ సుమారు రూ. 12,500 ఉంటుందని తెలిపారు. సంఘటనా స్థలంలో దొరికిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని, ఎటువంటి అనుమతులు లేకుండా వాటిని అక్రమంగా తరలిస్తున్న గుర్తుతెలియని ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేసి ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. పేలుడు పదార్థాలు ఎక్కడినుండి వస్తున్నాయనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 52 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్, ఏప్రిల్ 8: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 7వ నంబర్ ప్లాట్ ఫారంలో రూ. 26 లక్షల విలువ చేసే 52 కేజీల ఎండు గంజాయి బ్యాగులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్పలతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

రైల్వే స్టేషన్‌లోని 7వ నంబర్ ప్లాట్ ఫారంలో ఈ నెల 9వ తేదీన ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా.. నాలుగు భారీ బ్యాగులు అనుమానాస్పదంగా అక్కడ ఉన్నాయి. ఆ బ్యాగుల వద్ద ఎవరు లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది . వెంటనే ఆ బ్యాగులను ఓపెన్ చేసి చూడగా అందులో గంజాయి ఉందని పోలీసులు గుర్తించారు. వెంటనే రైల్వే సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న పలువురిని, స్టాల్స్ వ్యాపారులను ఈ బ్యాగ్‌ల గురించి ఆరా తీయగా ఏలాంటి సమాచారం లభించలేదు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా రైల్లో అక్రమంగా నిందితులు వివిధ రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు రైల్వే పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని రైల్వే డిఎస్పీ జావేద్ వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల కూల్చివేత.. రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం..

హైదరాబాద్, ఏప్రిల్ 10:ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ఇండ్లను షేక్‌పేట్ మండల రెవెన్యూ సిబ్బంది గురువారం నేలమట్టం చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 46 లోని అంబేద్కర్ నగర్‌ను ఆనుకొని ఉన్న జేఎన్ఆర్ఎమ్ ఇండ్ల పక్కన సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ ఐదు బ్లాకులు నిర్మించాల్సి ఉండగా నాలుగు బ్లాకులు మాత్రమే నిర్మించారు. 64 మంది లబ్ధిదారులకు జేఎన్ఆర్ఎమ్ ఇండ్లను కేటాయించారు. కాగా మరో బ్లాకు నిర్మాణం నిలిచిపోయింది.

ఇటీవల బస్తీలోని కొందరు నేతలు ఖాళీ స్థలాన్ని తలా కొంచెం పంచుకుని ఇండ్ల నిర్మాణం ప్రారంభించారు.

నెల రోజుల క్రితం వీటిని కూల్చిన రెవెన్యూ అధికారులు స్థానిక నేతలపై కేసు నమోదు చేశారు. అయితే మరోసారి రెండు రోజులుగా ప్రభుత్వ స్థలంలో గదుల నిర్మాణం చేపట్టడంతో సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసిల్దార్ అనితారెడ్డి తన సిబ్బందితో వచ్చి కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో బస్తీ నేతలు వెంకన్న, అరుణ తదితరులు రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సెల్ ఫోన్ లాక్కుని న్యూసెన్స్ చేశారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు చేపట్టనున్నామని తహసిల్దార్ హెచ్చరించారు.

ఆహ్వానం

రామదాసు సాహితీ కళా సేవా సంస్థ

(సుర్లేపల్లి, నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా) రి.నెం. 435/2024

ద్వితీయ వార్షికోత్సవం

తేది : 13.04.2025 ఆదివారం ఉ॥ 9 గంటల నుండి మ॥ 1 గంట వరకు
వేదిక : కళా సంగీత నాట్య వేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్.

విశిష్ట అతిథి :
శ్రీ తేజావత్ రామదాసు గారు, Addl. DCP Traffic, Hyderabad City

సభాధ్యక్షులు :
శ్రీ రామకృష్ణ చంద్రమౌళి గారు
ప్రముఖ కవి, విశ్లేషకులు, ఆధ్యాత్మికవేత్త

ముఖ్య అతిథులు :
డా. వి.డి. రాజగోపాల్ గారు
విశ్రాంత డైరెక్టర్ ఆఫ్ మైన్స్, మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు
శ్రీ గంటా మనోహర్ రెడ్డి గారు
ప్రముఖ కవి, విశ్లేషకులు, ఆధ్యాత్మికవేత్త
శ్రీమతి డా. రాధ కుసుమ గారు
ప్రముఖ కవయిత్రి, కుసుమ ధన్య కళాపీఠం అధ్యక్షులు

ప్రత్యేక అతిథులు :
శ్రీ భీమా శ్రీనివాసరావు గారు, ప్రముఖ కవి, రచయిత, ఆధ్యాత్మిక జిజ్ఞాసి
శ్రీ ఎం.వి. చంద్రశేఖరరావు గారు, ప్రముఖ కవి, విశ్రాంత రైల్వే ఆఫీసర్
డా. రవీంద్రబాబు అరవా గారు, ప్రముఖ కవి, గాయకులు
శ్రీ జె.వి. కుమార్ చేపూరి గారు, ప్రముఖ కవి, విశ్లేషకులు
డా. మోటూరి నారాయణరావు గారు, ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్
శ్రీ గూండ్ల నారాయణ గారు, ప్రముఖ కవి, రచయిత, BSNL విశ్రాంత ఆఫీసర్

సాత్వికాహార విందు భోజనం మధ్యాహ్నం 1 గంటకు.

ఆహ్వానించువారు :
దూత కుటుంబ సభ్యులు
రామదాసు సాహితీ కళా సేవా సంస్థ కార్యవర్గ కమిటీ సభ్యులు

మాతృత్వం ఓ అద్భుత దైవ కార్యంతో సమానం !

(11 ఏప్రిల్ "జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం" సందర్భంగా)

ఆడ జన్మకు సార్థకత అమ్మతనం. కళ్ల ముందు నడిచే దైవం అమ్మ. పునర్జన్మను పొందినమరో బిడ్డకు ప్రాణం పోసే అమ్మతనం మహిళలకు దేవుడిచ్చిన అపూర్వ అవకాశం. మాతృత్వం ఓ అద్భుత దైవకార్యంతో సమానం. అమ్మ కావడం స్త్రీకి తక్కిన అపురూప వరం. అత్యంత శక్తివంతమైన మాతృత్వం ఓ పరమ పవిత్ర కార్యం. ప్రాణాపాయం ఉంటుందని తెలిసి కూడా అమ్మతనమనే పేరును తెచ్చుకోవడానికి తాను గర్భిణిగా నవమాసాలు బిడ్డను మోసి, ప్రసవ వేదనను సంతోషంగా భరించి, కేరు కేరను ఏడ్చే నవజాత శిశువు స్వరాన్ని వింటూ నొప్పులను మరిచి మురిసి పోతుంది అమ్మ అయిన అతివ.

2025 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తం:

గర్భిణిగా, ప్రసవంలో, ప్రసవానంతరం కూడా తల్లికి సురక్షిత ఆరోగ్యాన్ని అందించడం మన కనీస బాధ్యత అని గమనించిన "వైట్ రిబ్బన్ అలియెన్స్" సంస్థ చొరవతో ప్రతి ఏట 11 ఏప్రిల్ రోజున భారత దేశవ్యాప్తంగా "జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం (నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డే)" నిర్వహించడం 2003 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రేమ, త్యాగం, అవధులు లేని ధైర్యం అనే విలువలను ఇంధనాలుగా మలిచి మహిళ మాతృత్వాన్ని అనుభవిస్తుంది. మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బ గాంధీ జన్మదినం 11 ఏప్రిల్‌ను పురస్కరించుకొని జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం పాటించుట జరుగుతున్నది. 2025 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తంగా "మాతృ సంబంధ ఆరోగ్య సురక్ష సమానత్వం : ఏ తల్లిని వదల వద్దు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

భారత్‌లో మాతాశిశు సంరక్షణ చర్యలు :

ప్రపంచ దేశాల్లో భారతీయ మహిళలు లేదా తల్లులు ప్రమాదకర వాతావరణాల్లో జీవితాలను గడుపుతున్నారని, ప్రపంచ గర్భిణి మహిళల మరణాల్లో 15 శాతం వరకు భారతంలోనే జరుగుతున్నట్లు తేలడం విచారకరం. సాలీనా 44,000 మంది మహిళలు ప్రసవానికి ముందు, ప్రవ సమయంలో లేదా ప్రసవానంతరం సరైన వైద్య సేవలు అందని కారణంగా మరణిస్తున్నట్లు తెలుస్తున్నది. మన దేశ గర్భిణులు, ప్రసవ సమయంలో లేదా ప్రసవం తర్వాత తల్లులు 12 శాతం వరకు మరణిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్త తల్లుల మరణాలు 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జరగడం గమనార్హం. 190 నుంచి 2015 వరకు 44 శాతం తల్లుల మరణాలు తగ్గడం, 2016 నుంచి 2030 వరకు ఒక లక్ష తల్లుల్లో 70 కన్న తక్కువ మరణాలు నమోదు అయ్యే విధంగా పలు కటుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. గ్రామీణ, పేద వర్గాలకు చెందిన మహిళలు అధికంగా ప్రమాదకర వాతావరణాల్లో బతుకులు ఈడ్చడం జరుగుతున్నది.

మాతాశిశు సంక్షేమం ప్రభుత్వాల కనీస బాధ్యత :

గర్భిణులు, ప్రసవ సమయం, ప్రసవానంతరం తల్లి, బిడ్డ సురక్షకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. ఈ విధులకు సుశిక్షితులైన వైద్య సిబ్బందిని నియమించడం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. మాతాశిశు సంక్షేమమే రేపటి ఆరోగ్యవంతమైన పౌర సమాజ స్థాపనకు పునాదులుగా తీసుకోవాలి. అమ్మతనం అమృత భావం. శిశువుకు తెలిసిన తొలి దైవం కన్న తల్లి మాత్రమే. ఇంట్లో కొలువైన అమాయక బాధ్యతగల ప్రేమ మూర్తి అమ్మ మాత్రమే. మాతృత్వం కోసం పరితపించే మహిళ నుంచి ప్రసవానంతర తల్లి వరకు అన్ని దశల్లో మాతృ శిశు ఆరోగ్యాన్ని బలపరచడం మన కనీస బాధ్యత.

అమ్మతనం పట్ల అవగాహన, తల్లులు లేదా గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రసవ సమయ సవాళ్లను అధిగమించడం, సురక్షిత ప్రసవం, ప్రసవానంతర చర్యలు తీసుకోవడం లాంటి అంశాలే కేంద్రంగా జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం కొనసాగాలి. అమ్మ లేని తనువు లేదు. అమ్మ ప్రేమకు తత్సమాన బంధం లేదు. అమ్మ ద్వేషించే బిడ్డ ఉండదు.

తల్లి పాసు రుచి చూడని తనువు లేదు. అమ్మను ప్రసవ సమయంలో కోల్పోయిన బిడ్డలంత దురదృష్టవంతులు లేరు. అమ్మ మనసు వెన్నంట మృదువు. అమ్మ ప్రేమ కలుషితం కాని అనుభవం. మాతృత్వానికి తలవంచి, అమ్మకు పాదాభివందనం చేసి, నేటి భార్యను రేపటి తల్లిగా భావించి తగు జాగ్రత్తలు తీసుకుందాం. మాతాశిశు సంక్షేమానికి గొడుగు పడదాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

పోర్చుగల్ అధ్యక్షుడు ఏర్పాటు చేసిన విందుకు హాజరైన రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:పోర్చుగల్‌లోని లిస్బన్ లో గల సిటీ హాలులో నిన్న (2025 ఏప్రిల్ 7న) నిర్వహించిన ఒక కార్యక్రమంలో లిస్బన్ మేయరు చేతులమీదుగా 'సిటీ కీ ఆఫ్ ఆనర్'ను భారత్ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అందుకొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఈ సన్మానానికి మేయరుకు, లిస్బన్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. లిస్బన్ దాపరికం లేని ఆలోచనలకు, ప్రజల ఆప్యాయతకు, సహనశీలత్వానికి, భిన్నత్వం పట్ల గౌరవానికి, సంస్కృతికి కూడా ప్రసిద్ధి చెందిందని ఆమె అన్నారు. లిస్బన్ నగరం సాంకేతిక మార్పు, నవకల్పన, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ పరివర్తన రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్న ప్రపంచ నగరం అని తెలుసుకొని తాను సంతోషిస్తున్నానని ఆమె తెలిపారు. ఈ రంగాల్లో భారత్, పోర్చుగల్ మరింత సహకరించుకొనే అవకాశాలు ఉన్నాయని ఆమె అన్నారు.

పోర్చుగల్ అధ్యక్షుడు శ్రీ మార్సెలో రెబెలో డి సూసా నిన్న సాయంత్రం పలసియో డా అజుడాలో రాష్ట్రపతి గౌరవార్థం ఏర్పాటు చేసిన ఒక విందు కార్యక్రమంలో శ్రీమతి ముర్ము పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, మన రెండు దేశాల ప్రజల మధ్య సాంస్కృతిక సంబంధాలు శతాబ్దాల నాటివని, ఈ సంబంధాలు మన సామూహిక భావనపై చెరగని ముద్ర వేశాయన్నారు. వాటిలో మన రెండు దేశాల గత కాలం ఒక భాగంగా ఉందని, ఇది వాస్తుకళ, చారిత్రక స్థలాలు, భాషలే కాక మన వంట వద్ధతుల్లో ప్రతిబింబిస్తోందన్నారు.

ఈ సంవత్సరానికి ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, ఇండి యా-పోర్చుగల్ ద్వైపాక్షిక సంబంధాలు 50వ సంవత్సరాన్ని పూర్తి చేసుకొంటున్న ఘట్టాన్ని మనం ఈ ఏడాదిలోనే పండుగలా జరుపుకొంటున్నామని రాష్ట్రపతి తెలిపారు. మన ఉభయ దేశాల మధ్య సహజ అనుబంధానికి తోడు అనేక రంగాల్లో సహకారానికి గల అవకాశాలు, మన చారిత్రక సంబంధాలు ఒక చైతన్యభరిత, దార్శనిక భాగస్వామ్యంలా రూపొందే దిశలో పురోగమిస్తున్నాయని ఆమె అన్నారు. సైన్, టెక్నాలజీ, రక్షణ, ఐటీ, అంకుర సంస్థలు, పరిశోధన, విద్యారంగ సహకారంతోపాటు సాంస్కృతిక సహకారం సహా వివిధ రంగాలలో భారత్, పోర్చుగల్‌ల మధ్య సహకారం నిరంతరాయంగాను, ప్రగతిశీల దృక్పథంతోను వృద్ధి చెందుతున్నందుకు రాష్ట్రపతి శ్రీమతి ముర్ము సంతోషాన్ని వ్యక్తం చేశారు.

జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా భారత్ అందరికీ ప్రయోజనాలు దక్కే సమ్మిళిత, నిరంతర అభివృద్ధి నమూనాను ఆవిష్కరించడానికి సైన్, టెక్నాలజీ, సహకారం, టెలికమ్యూనికేషన్ టెక్నాలజీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అంకుర సంస్థలు, నవకల్పన వంటి రంగాల్లో తనకున్న బలాలను ఉపయోగించుకొంటోందని రాష్ట్రపతి అన్నారు. ఈ ప్రయత్నాల్లో పోర్చుగల్‌ను భారత్ తన భాగస్వామిగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఐరోపా సంఘంతో భారత్ సంబంధాలను ప్రోత్సహించడంలో పోర్చుగల్ పోషిస్తున్న పాత్రను రాష్ట్రపతి ప్రశంసించారు. ఈయూకు పోర్చుగల్ అధ్యక్ష పదవీబాధ్యతలను నిర్వహించిన కాలంలోనే ఇండియా-ఈయూ మొట్టమొదటి శిఖరాగ్ర సదస్సును నిర్వహించారని, 2021 మే నెలలో మరోసారి పోర్చుగల్ అధ్యక్షతన చారిత్రక "ఇండియా-ఈయూ ప్లస్ 27" నాయకత్వ శిఖరాగ్ర సదస్సు సైతం పోర్చుగల్‌లో చోటు చేసుకొందని రాష్ట్రపతి గుర్తు చేశారు.

దాదీ రతన్ మోహినీ మృతి పట్ల సంతాపం ప్రకటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:బ్రహ్మకుమారి ధార్మిక సంస్థ ఆధ్యాత్మిక గురువు దాదీ రతన్ మోహినీ జీ మృతి పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. దయామయిగా, జ్ఞానమయిగా, వెలుగులు పంచిన మూర్తిగా ఆమెను చిరకాలం గుర్తుంచుకుంటామని ప్రధాని అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మకుమారి జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంలో ఆమె సమర్థమైన నాయకత్వ పాత్ర మరువలేనిదని ప్రశంసించారు. దాదీతో తనకు గల ప్రత్యక్ష అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, మనః శాంతిని ఆశించేవారు, సమాజ ఉద్ధరణకు కంకణం కట్టుకున్న వారికి ఆమె మార్గనిర్దేశనం, జీవితం స్ఫూర్తిదాయకాలని శ్రీ మోదీ అన్నారు.

"మేరు శిఖరం వంటి దాదీ రతన్ మోహినీజీ ఆధ్యాత్మిక వ్యక్తిత్వం ఎంతో ప్రభావం చూపింది. దయామయిగా, జ్ఞానమయిగా, వెలుగులు పంచిన మూర్తిగా ఆమెను చిరకాలం గుర్తుంచుకుంటాం. అచంచల విశ్వాసం, సరళమైన జీవనశైలి, సేవ పట్ల తిరుగులేని నిబద్ధత కలబోతల ఆమె జీవితం రాబోయే తరాలకు స్ఫూర్తిని కలిగించగలదు. ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మకుమారి జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంలో ఆమె సమర్థమైన నాయకత్వ పాత్ర మరువలేనిది. వినయం, సహనం, కరుణ, ఆలోచనల్లో స్పష్టత వంటి గుణాలు దాదీని ప్రత్యేక వ్యక్తిగా నిలిపాయి. మనః శాంతిని ఆశించేవారు, సమాజ ఉద్ధరణకు కంకణం కట్టుకున్న వారికి ఆమె మార్గనిర్దేశనం, జీవితం స్ఫూర్తిదాయకాలుగా కొనసాగుతాయి. దాదీతో గల నాకు గల అనుబంధం, జ్ఞాపకాలు ఎంతో విలువైనవి. ఈ కష్ట సమయంలో ఆమె అభిమానులకు, అంతర్జాతీయ బ్రహ్మ కుమారీ సమాజానికీ నా సానుభూతిని తెలియజేస్తున్నాను. ఓం శాంతి!" అని పేర్కొన్నారు.

ముద్రా యోజన పదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో దేశవ్యాప్తంగా గల ముద్రా రుణ లబ్ధిదారులతో ముచ్చటించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:నేపథ్యం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ముద్రా యోజన పదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా గల ముద్రా రుణ లబ్ధిదారులతో ముచ్చటించారు. ఆంధ్ర ప్రదేశ్ లబ్ధిదారుతో ప్రధానమంత్రి సంభాషణ ఈ విధంగా సాగింది:

లబ్ధిదారు: చాలా సంతోషం సర్.. నాకు 2009లో పెళ్ళయింది. అప్పటి నుంచి 2019 వరకూ గృహిణిగానే ఉన్నాను. 2019లో నాకు కెనరా బ్యాంక్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం వారు 13 రోజుల పాటు జ్యూట్ సంచుల తయారీలో శిక్షణనిచ్చారు. ముద్రా యోజన పథకం కింద బ్యాంక్ ద్వారా నాకు 2 లక్షల రూపాయల రుణం అందింది. దాంతో నవంబర్ 2019లో నేను నా వ్యాపారాన్ని మొదలుపెట్టాను. కెనరా బ్యాంకు వారు నా మీద పూర్తి నమ్మకంతో నాకు రెండు లక్షల రూపాయల రుణాన్ని మంజూరు చేశారు. ఈ క్రమంలో వారు నన్ను ఎటువంటి పూచీకత్తు అడగలేదు. లోన్ పొందేందుకు నేను ఇతరత్రా ఎటువంటి ప్రయత్నమూ చేయవలసిన అవసరం రాలేదు. పూచీకత్తు లేకుండానే నాకు రెండు లక్షల రూపాయల రుణం అందింది. బ్యాంక్ అప్పును నేను సకాలంలో తీర్చినందువల్ల 2022లో బ్యాంక్ వారు నాకు మరో 9.5 లక్షల రుణాన్ని మంజూరు చేశారు. ఇప్పుడు నా వద్ద 15 మంది పని చేస్తున్నారు.

ప్రధానమంత్రి: అయితే 2 లక్షల పెట్టుబడితో మొదలుపెట్టిన మీరు 9.5 లక్షల వరకు చేరుకున్నారు.. మీ వద్ద ఎంత మంది పని చేస్తున్నారన్నారు.లబ్ధిదారు: 15 మంది సర్.. వీరంతా గృహిణులే.. అందరూ గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రంలో (ఆర్‌సీటీ) శిక్షణ పొందిన వారే! ఒకప్పుడు నేను శిక్షణార్థిగా ఉన్న నేను ఈరోజు నలుగురికి శిక్షణనిచ్చే బోధకురాలిగా మారాను. ఇటువంటి అద్భుతమైన అవకాశం నాకు దక్కినందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

ఒంటిమిట్టలో సందడి.. రేపు రామయ్య కళ్యాణం

కడప, ఏప్రిల్ 10: ఒంటిమిట్టలో రమణీయంగా కోదండరామయ్య వార్షిక బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి.. ఐదవ రోజు ఉదయం మోహిని అలంకారంలో సీతారామ లక్ష్మణులు విహరించారు.. స్వామి అమ్మవార్లకు పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు పండితులు.. మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో కోలాహలంగా జగదభి రామయ్య వాహన సేవ నిర్వహించారు.. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు.

పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.. అయితే, రేపు ఒంటిమిట్ట కోదండ రాముని కళ్యాణోత్సవం జరగనుంది.. సాయంత్రం 6:30 నుంచి రాత్రి 9:30 మధ్య పండు వెన్నెలలో పౌర్ణమి రోజున రాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు.. సీతారాముల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం చేసింది టీటీడీ.. భక్తులకు పంపిణీ చేయడానికి లక్ష ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్లు సిద్ధం చేశారు..

ఇక, రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడపకు రానున్నారు.. రేపు ఒంటిమిట్ట కోదండ రామాలయం కల్యాణోత్సవంలో పాల్గొననున్నారు ఏపీ సీఎం.. ప్రభుత్వం తరఫున రాములవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.. రాత్రికి ఒంటిమిట్టలోని టీటీడీ గెస్ట్ హౌస్ లో బస చేయనున్నారు సీఎం చంద్రబాబు.. 12వ తేదీన తిరిగి కడప ఎయిర్‌పోర్ట్ నుంచి విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు..

కాగా, ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.. రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ రామనవమి, హనుమత్సేవ, ఈ రోజు గరుడసేవ, రేపు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలతో పాటు ముత్యాల తలంబ్రాలను స్వామివారికి సమర్పించనున్నారు. అనంతరం గజ వాహన సేవ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 12వ తేదీన రథోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 14వ తేదీన ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అలాగే, ఏప్రిల్ 15న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది.

భారత నావికాదళం కోసం ఫ్రాన్స్ నుంచి 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను కొనుగోలు

న్యూ డిల్లీ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ(సీసీఎస్) భారతదేశంలోనే అతిపెద్ద ఫైటర్ జెట్ ఒప్పందాన్ని ఆమోదించింది. భారత నావికాదళం కోసం ఫ్రాన్స్ నుంచి 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి అనుమతి ఇచ్చింది. రూ. 63,000 కోట్ల అగ్రిమెంట్‌పై త్వరలో ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందంలో 22 సింగిల్-సీటర్, నాలుగు ట్విన్-సీటర్ రాఫెల్ మెరైన్ జెట్‌లు ఉన్నాయి. ఒప్పందంపై సంతకం చేసిన ఐదు సంవత్సరాల తర్వాత రాఫెల్ ఓ జెట్‌ల డెలివరీలు ప్రారంభమవుతాయని తెలుస్తోంది.



కేసీఆర్ తెలంగాణను నిలబెడితే.. ఏడాదిన్నరలోనే రేవంత్ పడగొట్టిండు -హరీశ్ రావు

హైదరాబాద్ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి ఫైరయ్యారు. కేసీఆర్ తెలంగాణను నిలబెడితే.. ఏడాదిన్నరలోనే రేవంత్ పడగొట్టిండని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంగారెడ్డిలో మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం 12 శాతం జీఎస్టీ వృద్ధిరేటు ఉండేదని.. కానీ, ఇప్పుడు దేశ జీఎస్టీ కంటే సగానికి తెలంగాణ జిఎస్టి వృద్ధిరేటు పడిపోయిందని విమర్శించారు.దేశం 10 శాతం జీఎస్టీ వృద్ధిరేటు సాధిస్తే.. తెలంగాణ కేవలం 5శాతం మాత్రమే వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తున్నదని.. ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో నీళ్ళేవో అర్థం అయిపోయిందన్నారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప.. చేతలు లేవు అన్నది ప్రజలకు అర్థమయిందని అన్నారు. కేసీఆర్ సాగు భాష మాట్లాడితే.. రేవంత్ రెడ్డిది సావు భాష మాట్లాడుతున్నాడని హరీష్ రావు మండిపడ్డారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన భారీ తాటి చెట్టు.. 20 కాలనీలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

హైదరాబాద్, ఏప్రిల్ 10: గురువారం సాయంత్రం వచ్చిన గాలి దుమారానికి ఓ తాటి చెట్టు కూలి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన ఘటన వనస్థలిపురంలో చోటు చేసుకుంది. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని స్నేహమయి నగర్ కాలనీలో ఈ సంఘటన జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కొద్ది దూరంలో ఉన్న తాటి చెట్టు భారీ గాలి దుమారానికి కూలింది. దీంతో ఆ తాటి చెట్టు ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విరిగిపడిన తాటి చెట్టు కరెంటు తీగలపై ఒరిగి ఉండడంతో అటు నుంచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వనస్థలిపురం నుంచి శివారు కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి కావడం నిత్యం వందల సంఖ్యలో వాహనాలు మనుషులు వెళ్లే రహదారి కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సంఘటనతో స్నేహమయి నగర్ నమీపంలోని సుమారు 20 కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓవైపు గాలి మరోవైపు తేలికపాటి వర్షం పడుతుండడంతో ఏమి చేయలేని స్థితిలో డిఆర్ఎఫ్ బృందం వేచి చూసింది. కాగా వెంటనే స్పందించాల్సిన డిజాస్టర్ టీం, జిహెచ్ఎంసి అధికారులు, విద్యుత్ అధికారులు ఆ స్థాయిలో స్పందించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్నేహమయినగర్ కాలనీలో తాటి చెట్టు ప్రమాద భరితంగా ఉందని గతంలోనే స్థానికులు ఫిర్యాదులు చేశారు. జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖకు, ప్రజా ప్రతినిధులకు గతంలోనే ఫిర్యాదులు చేశారు. తాటి చెట్టు రోడ్డుపైకి, ట్రాన్స్ ఫార్మర్ పైకి వంగి ఉందని ఇది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని దాన్ని తొలగించాలని ఫిర్యాదుల అందినా అధికారులు కనీసం పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అదృష్టం బాగుంది పెను ప్రమాదం తప్పిందని ఇప్పటికైనా సాహెబ్ నగర్ శివారులో ప్రమాద భరితంగా ఉన్న చెట్లను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్జీయూకేటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన



ఆదిలాబాద్, ఏప్రిల్ 10: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నత విద్య ఎడ్యుకేషన్ కౌన్సిల్ ముట్టడికి ప్రయత్నించిన సందర్భంగా అరెస్టుకు నిరసనగా గురువారం బాసర ఆర్జీయూకేటి యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ల అసోసియేషన్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ విధులు బహిష్కరించి బంద్ లో పాల్గొన్నారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 21జీఓ ద్వారా రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే రెగ్యులర్ చెయ్యాలని, బేసిక్, డీఏ, హెచ్ ఆర్ ఏ, మూడు శాతం వేతనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణ ప్రసాద్, ఉపేందర్, శ్రీశైలం, శంకర్ దేవరాజ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ముద్ర యోజన పదో వార్షికోత్సవం... ఈ పథకం గణనీయ ప్రభావాన్ని చూపుతోందంటూ ప్రధానమంత్రి ప్రశంసలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:'ప్రధాన మంత్రి ముద్ర యోజన' (పీఎంఎంవై) అమలులోకి వచ్చి పదేళ్లు కావడాన్ని దేశం పండుగ చేసుకొంటున్న వేళ ఈ పథకం లబ్ధిదారులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

కలలను సాకారం చేసుకొనే అవకాశాలను కల్పించడంలో ముద్ర పథకానికి పదేళ్లు పూర్తి అయిన సందర్భాన్ని పండుగ చేసుకోవడం తోపాటు ఆర్థిక వృద్ధి ఫలాలు సమాజంలో అన్ని వర్గాల వారికీ చేరేటట్లు చూస్తూ ఆదరణకు నోచుకోని వర్గాల వారి అభ్యున్నతికి తోడ్పడడం లోనూ, దేశవ్యాప్తంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాన్ని అందించడంలోనూ కీలక పాత్రను పోషిస్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

ఎక్స్‌లో కొన్ని సందేశాలను ప్రధాని పొందుపరుస్తూ ఇలా పేర్కొన్నారు:

''ఈ రోజు, మనం ముద్ర పథకానికి పదేళ్లు పూర్తి అయిన ఘట్టాన్ని ఓ వేడుకగా జరుపుకొంటున్న వేళ ఈ పథకం చలవతో తమ జీవనంలో గణనీయమైన మార్పులు తెచ్చుకున్న వారందరికీ నేను అభినందనలు తెలియజేయాలనుకుంటున్నాను. ఈ పది సంవత్సరాల్లో ముద్ర యోజన ఎంతో మంది కన్న కలలను నిజం చేసింది. ఇదివరకు ఉపేక్షకు గురి అయిన వారికి ఆర్థిక సహాయాన్ని అందించి వారు రాణించే అవకాశాన్ని కల్పించింది. భారతీయులకు ఏదీ అసాధ్యం కాదని ఈ పథకం చాటిచెబుతోంది.''

"ముద్ర లబ్ధిదారుల్లో సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన సముదాయాల వారు ఉండడంతోపాటు లబ్ధిదారుల్లో 70 శాతం మందికి పైగా మహిళలే ఉండడం చాలా సంతోషం. ప్రతి ముద్రా రుణం గౌరవాన్నీ, ఆత్మ గౌరవాన్నీ, అవకాశాన్నీ ప్రసాదిస్తోంది. అన్ని వర్గాల వారినీ ఆర్థిక సేవలకు చేరువగా తీసుకురాడానికి తోడు, ఈ పథకం సామాజిక సంఘటితత్వానికీ, ఆర్థిక స్వాతంత్ర్యానికీ దన్నుగా నిలిచింది."

"రాబోయే సంవత్సరాల్లోనూ, మా ప్రభుత్వం ఒక పక్కా అనుబంధ విస్తారిత వ్యవస్థను నిర్మించడంపై దృష్టి కేంద్రీకరిస్తుంది. జీవనంలో ముందడుగు వేయాలని తపించే ప్రతి ఒక్క ఔత్సాహిక పారిశ్రామికవేత్తకూ ఈ అనుబంధ విస్తారిత వ్యవస్థ రుణాన్ని అందించి అతడికి లేదా ఆమెకు ఆత్మ విశ్వాసాన్నీ, వృద్ధిలోకి వచ్చే అవకాశాన్నీ అందిస్తుంది."

హయత్ నగర్‌లో భార్య ఆత్మహత్య.. రక్తపు మడుగులో భర్త మృతదేహం

హయత్ నగర్ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్): రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రిలయన్స్ డిజిటల్ షోరూమ్ వద్ద రక్తం మడుగులో మృతదేహం పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

హయత్ నగర్ లోని ముదిరాజ్ కాలనీకి చెందిన నగేష్ గా పోలీసులు గుర్తించారు. నగేష్ ను హత్య చేసి మృదేహాన్ని పడేశారా.. లేదా అక్కడే హత్య చేశారా లేక ఆత్మహత్య చేసుకున్నాడా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మృతుడి తలకు, చేతులకు, కాళ్లకు కత్తి గాయాలు ఉన్నాయని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు.

పోలీసులు క్లూస్ టీమ్ తో దర్యాప్తు చేస్తున్నారు.నగేష్ భార్య శిరీష మంగళవారం ఆత్మహత్య చేసుకుంది.

భార్య ఆత్మహత్య చేసుకోవడంతో భర్త నగేష్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న నగేష్ ను రాత్రి జామీను మీద బంధువులు బయటికి తీసుకొచ్చారు.

శిరీష ఆత్మహత్యతో భర్త నగేష్ పై మృతురాలు బంధువులు దాడి చేయడంతో చనిపోయాడా లేక భార్య ఆత్మహ త్యతో నగేష్ ఆత్మహత్యా చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శరీరంపై గాయాలు ఉండడంతో హత్య చేసి ఉంటారని అనే అనుమానాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూ డిల్లీ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. భారత్ సహా పలు దేశాలపై టారిఫ్‌లు ప్రకటించారు. తాజాగా మరో బాంబు పేల్చారు అధ్యక్షుడు. త్వరలోనే ఔషధ ఉత్పత్తులపై సుంకాల మోత మోగించనున్నట్లు ప్రకటించారు. అమెరికాకు దిగుమతయ్యే ఔషధ ఉత్పత్తులపై భారీ ఎత్తున టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు.మంగళవారం రాత్రి నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. అమెరికాలో ఫార్మా ఉత్పత్తులు తయారు కావడం లేదన్నారు. అందుకే ఇతర దేశాల నుంచి వచ్చే ఔషధ ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. ఈ చర్యతో చైనా సహా వివిధ దేశాల్లోని ఫార్మా కంపెనీలన్నీ అమెరికాకు తరలివస్తాయని, ఇక్కడ తమ ప్లాంట్లను తెరుస్తాయని వ్యాఖ్యానించారు. కాగా, ఏప్రిల్ 2న భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, వీటిలో ఔషధ ఉత్పత్తులకు తాత్కాలికంగా మినహాయింపు లభించింది. ఇప్పుడు వాటిపై కూడా త్వరలోనే సుంకాలు విధించనున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు.ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే.. భారత ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులకు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. అమెరికా ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన ఔషధాలు అందడంలో భారతీయ ఫార్మా కంపెనీలది కీలకపాత్ర. భారత్ అమెరికాకు చేసే ఔషధ ఎగుమతులు ఎక్కువగా జనరిక్ మందులే ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం.అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వచ్చినవే. సిప్లా, లుపిన్, సన్ ఫార్మా వంటి సంస్థలతో పోల్చితే జనరిక్ ఔషధాలను భారీగా ఉత్పత్తి చేస్తున్న జైడస్, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ తదితర కంపెనీలపైనే అమెరికా టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఫార్మా కంపెనీలు.. అమెరికా మార్కెట్ నుంచి ఐరోపా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల వైపునకు వెళ్లడమే ఉత్తమమని ఔషధ రంగ నిపుణులు భావిస్తున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు.. ఏసీపీ రాజా వెంకట రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 10:చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ రాజా వెంకటరెడ్డి తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నిజామాబాద్ 5వ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్ల ప్రవర్తనలో మార్పు కోసం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు గురువారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రౌడీషీటర్ల నేర చరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇప్పటి నుండి రౌడీ షీటర్స్ ఉన్న వారి పేర్లు కానీ, మొహాలు కానీ ఎలాంటి కేసులోనైనా, గ్రూపు తగాదాలలో ఐనా ఎవరి ప్రోద్బలంతో, ప్రభలంతోనైనా, ఎవరైనా ఫోన్లలో చెప్పడం వలన గానీ, నేరాల్లో పాలుపంచుకోకూడదన్నారు. ఈ కౌన్సిలింగ్ కు హాజరైన వారిలో ఎవరైనా భవిష్యత్తులో నేరాల్లో పాలుపంచుకుంటే చట్టంలో ఉన్న యాక్ట్ ల ప్రకారం శాశ్వతంగా జైలు జీవితం గడప వలసి వస్తుందని ఏసీపీ హెచ్చరించారు.

కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్రధాన కారణం మీ నేర ప్రవృత్తిని విడిచి కుటుంబ సభ్యులతో కలిసి మంచి జీవన ఉపాధి ఏర్పరచుకొని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చెడు బుద్ధితో కొంతమంది చెప్పిన మాటలు విని, నమ్మి చట్ట వ్యతిరేకమైన కార్యకాలపాలకు పాల్పడితే?. జైలుపాలు అవడం తప్పదన్నారు. బిర్యానీ ప్యాకెట్లు, మందు, కొంత డబ్బు లభిస్తుందేమో కానీ అది శాశ్వతమైనది కాదు. రౌడీ షీటర్ల పై ప్రత్యేకంగా ప్రతిరోజు పోలీస్ స్టేషన్ పిలిపించవచ్చు,..రాత్రి, పగలు సమయంలో మీ ఇండ్లను సందర్శించి మిమ్మల్ని చెక్ చేయడం జరుగుతుందన్నారు. మీపై ఒక ప్రత్యేక టీం చేత నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుంది.. మిమ్మల్ని గమనిస్తూ ఉంటామన్నారు. ఎలాంటి నేరాల్లో పాల్గొనకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్న వ్యక్తులను గుర్తించి వారి రౌడీ షీట్లను తీసేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, 5వ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా దంచికొడుతున్నా ఎండలు

- భానుడి భగభగలకు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనాలు

న్యూ డిల్లీ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి . పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే భారీగా నమోదవుతున్నాయి. భానుడి భగభగలకు జనాలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలను మంగళవారం వేడిగాలులు వణికించాయి. దేశరాజధాని ఢిల్లీ సహా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ముఖ్యంగా ఎడారి రాష్ట్రం రాజస్థాన్ లోని బార్మర్ లో దేశంలోనే అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడ మంగళవారం 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఎఐఎ) తెలిపింది. ఇది సాధారణం కంటే 7.6 డిగ్రీలు ఎక్కువ అని పేర్కొంది. బార్మర్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జైసల్మేర్‌లో 45 డిగ్రీల సెల్సియస్, చిత్తోర్‌గఢ్‌లో 44.5 డిగ్రీల సెల్సియస్, బికనీర్‌లో 44.4 డిగ్రీల సెల్సియస్, గంగానగర్‌లో 44.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 7 నుంచి 9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ అని ఐఎండీ తెలిపింది.ఇక దేశరాజధాని ఢిల్లీలోని ప్రాథమిక వాతావరణ కేంద్రం సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధానిలో ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం సఫ్దర్‌జంగ్‌లో ఉష్ణోగ్రతలు 40.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు ఐఎండీ పేర్కొంది. ఇది సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువ. గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని మొత్తం 27 స్టేషన్లలో 43 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. వాటిలో కనీసం 19 స్టేషన్లలో వేడిగాలులు నుండి తీవ్రమైన వేడిగాలులు నమోదైనట్లు పేర్కొంది.మరోవైపు గుజరాత్‌లోని సురేంద్ర నగర్‌లో 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజ్‌కోట్‌లో 44 డిగ్రీల సెల్సియస్, అమ్రేలిలో 43.8 డిగ్రీల సెల్సియస్, మహువ, కాండ్లాలో 43.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహువలో సాధారణం కంటే 8.3 డిగ్రీలు ఎక్కువ అని ఐఎండీ పేర్కొంది. మహారాష్ట్రలోని అకోలాలో 44.1 డిగ్రీల సెల్సియస్, నందూర్‌బార్‌లో 43.5 డిగ్రీల సెల్సియస్, జల్గావ్‌లో 43.3 డిగ్రీల సెల్సియస్, అమరావతరిలో 43 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని గుణ, రత్లామ్‌లలో ఉష్ణోగ్రతలు వరుసగా 43.4, 43.2 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఏప్రిల్ 10, 11 తేదీల్లో గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేడిగాలుల పరిస్థితుల నుంచి ఉపశమనం లభించొచ్చని ఐఎండీ అంచనా వేసింది.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి- శ్యామ్ ప్రసాద్

జగిత్యాల, ఏప్రిల్ 10:విద్యార్థులు చారు. ప్రతినిత్యం విద్యార్థులకు అంది ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి న్తున్న ఆహారంపై అడిగి చేయాలని మహాత్మ జ్యోతిబాపూలే తెలుసుకున్నారు.
గురుకుల సంస్థ రాష్ట్ర జాయింట్ ఈసందర్భంగా మాట్లాడుతూ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ విద్యా ప్రమాణాలను పెంపొందించి, ఆదేశించారు. గురువారం జగిత్యాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను జిల్లాలోని అల్లిపూర్ లో రెసిడెన్షియల్ అందించి ఉత్తమ ఫలితాలు సాధించే పాఠశాలను సందర్శించి విద్యార్థులకు లా కృషి చేయాలన్నారు. పరీక్షలకు అందుతున్న వసతులను పరిశీలిం విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు రావాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, నాసిరకం సరుకులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, నాణ్యమైన విద్యను అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు.

పంచాయతీ కార్యదర్శికి రూ.85 కోట్ల ఆస్తి

- ఏసీబీ అధికారులు దాడులలో వెల్లడైన వైనం

తిరుపతి ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఓ పంచాయతీ కార్యదర్శి కోట్లకు పడగలెత్తాడు. ఎవరూ ఊహించని విధంగా ఆస్తులను కూడబెట్టాడు. ఆ పంచాయతీ కార్యదర్శి ఆస్తులను చూసి ఏసీబీ అధికారులు సైతం షాక్‌కు గురయ్యారు.వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి జిల్లా చంద్రగిరి పంచాయతీ పూర్వ కార్యదర్శి మహేశ్వరయ్య ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై తిరుపతి, కడప జిల్లాల ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఫిబ్రవరిలో రూ. 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. సస్పెండ్‌కు గురయ్యాడు. ఈ క్రమంలో తాజాగా తిరుపతి పేరూరులోని మహేశ్వరయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించారు.ఈ సోదాల్లో పలు కీలక విషయాలు బయటపడ్డాయి. బెంగళూరులో రూ.10 కోట్ల విలువైన అపార్ట్‌మెంట్, పలమనేరులో 3 అంతస్తుల ఇల్లు, ఫాంహౌస్, బద్వేలులో భూములు, భారీగా బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మొత్తం ఆస్తుల విలువ రూ. 85 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు.చిత్తూరు జిల్లా గంగవరంలో ప్రధాన రహదారిపైన సుమారు రూ.ఐదారు లక్షలతో మహేశ్వరమయ్య గతంలో అమ్మవారి ఆలయం నిర్మించారు. ఇటీవల ఈ ఆలయాన్ని ఆధునికీకరించారు. ఇదంతా పాప పరిహారం కోసమే చేసినట్టు ఉందంటూ అక్కడి ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

అమరావతిలో కొత్త ఇల్లు.. భూమి పూజ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఏపీ సీఎం, తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు అమరావతిలో సొంతింటి నిర్మాణానికి సిద్ధమయ్యారు.

ఉండవల్లిలోని కరకట్టపై ఇప్పటికే చంద్రబాబుకు ఒక ఇల్లు ఉంది. అయితే వరదలు వచ్చిన ప్రతిసారి అది మునిగిపోతూ వస్తోంది. దీంతో అమరావతిలో మరో ఇంటిని నిర్మించుకోవాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే వెలగపూడి సచివాలయం వెనుక ఈ9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపట్టారు. బుధవారం నాడు ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు.వెలగపూడి రెవెన్యూ పరిధిలోని సచివాలయం వెనుక, ఎమ్మెల్యే క్వార్టర్ల సమీపంలో ఐదెకరాల విస్తీర్ణంలోని నివాస ఫ్లాట్‌ను అదే గ్రామానికి చెందిన ఓ రైతు కుటుంబం నుంచి గత ఏడాది డిసెంబర్‌లో చంద్రబాబు కొనుగోలు చేశారు. ఆ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇటీవల పూర్తయ్యింది. దీంతో ఐదెకరాల స్థలంలోని 1455 చదరపు గజాలలో జీప్లస్ వన్ ఇంటిని నిర్మించనున్నారు. నిర్మాణ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేసి ఏడాదిలోపు గృహప్రవేశం చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు.బుధవారం నాడు జరిగిన గృహ శంకుస్థాపన మహోత్సవంలో కుటుంబసభ్యులు మినహా పార్టీ నేతలు ఎవరికీ ఆహ్వానం అందలేదు. అంతేకాదు.. ఆ స్థలం వైపు ఎవరూ వెళ్లకుండా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. గ్రీన్ పరదాల మధ్య భూమి పూజ ముగిసింది.

పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్టం అమలు చేయబడదు: తేల్చిచెప్పిన మమత

కోల్‌కతా ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం అమలుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్టం అమలు చేయబడదు అని మమత తేల్చి చెప్పారు. కోల్‌కతాలో జైన్ కమ్యూనిటీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మమత పాల్గొని ప్రసంగించారు.వక్ఫ్ సవరణ చట్టంతో మైనార్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సీఎం మమత పేర్కొన్నారు. మైనార్టీ ప్రజలు, వారి ఆస్తులను తాను పరిరక్షిస్తానని ఆమె స్పష్టం చేశారు. విభజించి పాలించాలనుకుంటే బెంగాల్‌లో కుదరదు. తనపై విశ్వాసం ఉంచండి. మీరంతా కలిసికట్టుగా ఉంటామని బలమైన సందేశం ఇవ్వండి. రాజకీయ ఉద్యమం ప్రారంభించాలంటూ రెచ్చగొట్టే వాళ్లను పట్టించుకోవద్దని మమతా బెనర్జీ సూచించారు.వక్ఫ్ బిల్లుపై ముర్షిదాబాద్ జిల్లాలో హింస చెలరేగడాన్ని ప్రస్తావించిన మమతా బెనర్జీ.. బంగ్లాదేశ్‌లో పరిస్థితిని చూడండి. ఈ సమయంలో బిల్లు ఆమోదించి ఉండకూడదు. బెంగాల్‌లో 33 శాతం మైనారిటీలు ఉన్నారు. వారి విషయంలో నేను ఏం చేయాలి?'' అని ప్రశ్నించారు. బెంగాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇండియా అన్నీ కలిసి ఉండేవని చరిత్ర చెబుతోందని, ఆ తర్వాత విభజన చోటుచేసుకుందని, ఇక్కడ నివసించాలని ఎవరైతే అనుకున్నారో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా, బలంగా నిలబడితే ఏదైనా సాధ్యమేనని మమత స్పష్టం చేశారు.

పెట్రోల్ బంక్ ల్లో "నో స్టాక్" పరిస్థితి రావద్దు

-పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటి తాశిల్దార్ మాచన రఘునందన్

హైదరాబాద్ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పెట్రోల్ బంక్ ల్లో నో స్టాక్ బోర్డు పెట్ట వద్దని,ఇంధన నిల్వలు ఐపోక ముందే..తగినంత ఇంధనం నిల్వ చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటి తాశిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు.గురువారం నాడు ఆయన నల్లగొండ లో మాట్లాడుతూ.. హైదరాబాద్ కు 100,150 కిలోమీటర్ల పరిధి వరకు ఆయా పెట్రోల్ బంకు ల డిమాండు అనుసారం చమురు సంస్థలు ఎప్పటికప్పుడు ..అవసరం మేరకు ఇంధనం సరఫరా చేస్తున్నాయని రఘునందన్ తెలిపారు.ఐతే పెట్రోల్ బంక్ నిర్వాహకుల ఉదాసీనత వల్లనో, నిస్తేజం వల్ల ఒక్కో సారి పెట్రోల్ బంక్ ల్లో ఇంధనం టైం కి చేరక,అందక కొన్ని పెట్రోల్ బంక్ ల్లో నో స్టాక్ బోర్డు పెట్టే పరిస్థితి నెలకొనే అవకాశం లేకపోలేదని ర్ ఎ.రఘునందన్ అభిప్రాయపడ్డారు.అందుకే పెట్రోల్ బంకు ల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ.. నో స్టాక్ బోర్డు పెట్టే పరిస్థితి తలెత్తకుండా యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని రఘునందన్ అన్నారు. పలు ప్రాంతాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం ఐన నేపథ్యం లో.. లారీలు, ట్రాక్టర్ల కు తగినంత ఇంధనం అవసరం ఉంటుంది కాబట్టి,పెట్రోల్ బంక్ ల్లో ఇంధన నిల్వలు సిద్ధం గా అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని రఘునందన్ స్పష్టం చేశారు

ముద్ర యోజన పదో వార్షికోత్సవం... ఈ పథకం గణనీయ ప్రభావాన్ని చూపుతోందంటూ ప్రధానమంత్రి ప్రశంసలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:'ప్రధాన మంత్రి ముద్ర యోజన' (పీఎంఎంవై) అమలులోకి వచ్చి పదేళ్లు కావడాన్ని దేశం పండుగ చేసుకొంటున్న వేళ ఈ పథకం లబ్ధిదారులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

కలలను సాకారం చేసుకొనే అవకాశాలను కల్పించడంలో ముద్ర పథకానికి పదేళ్లు పూర్తి అయిన సందర్భాన్ని పండుగ చేసుకోవడంతోపాటు ఆర్థిక వృద్ధి ఫలాలు సమాజంలో అన్ని వర్గాల వారికీ చేరేటట్లు చూస్తూ ఆదరణకు నోచుకోని వర్గాల వారి అభ్యున్నతికి తోడ్పడడం లోనూ, దేశవ్యాప్తంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాన్ని అందించడంలోనూ కీలక పాత్రను పోషిస్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

''ఈ రోజు, మనం ముద్ర పథకానికి పదేళ్లు పూర్తి అయిన ఘట్టాన్ని ఓ వేడుకగా జరుపుకొంటున్న వేళ ఈ పథకం చలవతో తమ జీవనంలో గణనీయమైన మార్పులు తెచ్చుకున్న వారందరికీ నేను అభినందనలు తెలియజేయాలనుకుంటున్నాను. ఈ పది సంవత్సరాల్లో ముద్ర యోజన ఎంతో మంది కన్న కలలను నిజం చేసింది. ఇదివరకు ఉపేక్షకు గురి అయిన వారికి ఆర్థిక సహాయాన్ని అందించి వారు రాణించే అవకాశాన్ని కల్పించింది. భారతీయులకు ఏదీ అసాధ్యం కాదని ఈ పథకం చాటిచెబుతోంది.'' "ముద్ర లబ్ధిదారుల్లో సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన సముదాయాల వారు ఉండడంతోపాటు లబ్ధిదారుల్లో 70 శాతం మందికి పైగా మహిళలే ఉండడం చాలా సంతోషం. ప్రతి ముద్రా రుణం గౌరవాన్నీ, ఆత్మ గౌరవాన్నీ, అవకాశాన్నీ ప్రసాదిస్తోంది.



విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం

న్యూ డిల్లీ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి రష్యా నుంచి మరోసారి ఆహ్వానం అందింది. మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆంద్రీ రుడెంకో వెల్లడించారు.రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా మే 9న రష్యా విక్టరీ డే పరేడ్ నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తన మిత్రదేశాలకు ఆహ్వానం పంపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీకి కూడా ఆహ్వానం పంపింది. విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోదీ హాజరవుతారని

"స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యం ద్వారా ఆరోగ్యకరమైన బాల్యం సాధ్యం"

ప్రచారోద్యమం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖతో చేతులు కలిపిన డీడీడబ్ల్యూఎస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:ఏప్రిల్ 8 నుంచి 23 వరకు కొనసాగే 7వ పోషణ పక్షోత్సవంలో జలశక్తి మంత్రిత్వశాఖకు చెందిన తాగునీరు, పారిశుద్ధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) చురుగ్గా పాల్గొంటోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ చేపట్టిన సక్షం అంగన్వాడీ పథకానికి అనుగుణంగా, ఈ విభాగం చేపట్టిన ప్రచారోద్యమానికి "స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యం ద్వారా ఆరోగ్యకరమైన బాల్యం" అనే శీర్షికను పెట్టారు. "స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్యం ద్వారా సంపూర్ణ పోషణ మొదలు" అనే ప్రచారోద్యమం ఉపశీర్షిక బాలల పోషణ, సంపూర్ణ ఆరోగ్యం కోసం పరిశుభ్రమైన నీటి నిర్వహణ, పారిశుద్ధ్య పద్ధతులు కీలకమని తెలుపుతోంది.

పోషకాహార లోపం వల్ల కలిగే వ్యాధుల కట్టడికి పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య పద్ధతుల ప్రాముఖ్యాన్ని చాటే క్షేత్ర స్థాయి కార్యక్రమాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు విస్తృతంగా చేపడతాయి.

మహిళా శిశు సంక్షేమ శాఖ కృషికి చేదోడు వాదోడుగా డీడీడబ్ల్యూఎస్ విభాగం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేపడుతుంది. అత్యధిక స్థాయిలో ప్రజలను చేరుకునేందుకు అనువుగా వంటి హ్యాష్ టాగ్ ల వినియోగం సహా విరివిగా ప్రచారం.

జల జీవన మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, వాష్ (నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత) పథకం వంటి ఉమ్మడి కార్యాచరణతో ప్రజల్లో దీర్ఘకాలిక అవగాహనను కలిగించాలని, గ్రామీణ సమూహాల్లో ప్రవర్తనాపరమైన పరివర్తనను సాధ్యం చేయాలని పోషణ పక్షోత్సవం భావిస్తోంది తద్వారా మెరుగైన ఆరోగ్యం, పారిశుద్ధ్యం, బాలల్లో మెరుగైన పోషణ సాధించాలని ఆశిస్తోంది.

నాలుగో దశలో ఆర్ఆర్బీల విలీనం: ప్రకటించిన ఆర్థిక సేవల విభాగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:"వన్ స్టేట్, వన్ ఆర్ఆర్బీ" విధానం కింద 26 గ్రామీణ బ్యాంకులను (ఆర్ ఆర్ బీ) విలీనం చేస్తున్నట్లు ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ప్రకటన జారీ చేసింది. ఆర్ఆర్బీల విలీనంలో ఇది నాలుగో దశ.

గత విలీనాల వల్ల పనితీరు మెరుగైనట్లు గుర్తించడంతో 2024 నవంబరులో తాజా విలీన ప్రణాళికను ప్రకటించిన ఆర్థిక మంత్రిత్వశాఖ, భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులను ఏర్పాటు చేసింది. సంప్రదింపుల అనంతరం పది రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 26 ఆర్ఆర్బీల విలీన ప్రక్రియను పూర్తి చేశారు. సామర్థ్య పెంపు, ఖర్చు హేతుబద్ధీకరణ ఈ విలీనాల ప్రధాన లక్ష్యం.

ప్రస్తుతం 26 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో 43 ఆర్ఆర్బీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. విలీన ప్రక్రియ తుది దశ పూర్తయితే 26 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 700 జిల్లాల్లో 22,000 శాఖలతో మొత్తం 28 ఆర్ఆర్బీలు పనిచేస్తాయి. ప్రాథమికంగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే ఈ బ్యాంకులు, గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల్లో 92 శాతం శాఖలను కలిగి ఉన్నాయి.

ప్రస్తుతం చేపట్టిన విలీనాలు నాలుగో దశకి చెందినవి. తొలి దశలో (2006-2010 ఆర్థిక సంవత్సరాల కాలం) ఆర్ఆర్బీల సంఖ్య 196 నుంచు 82కు, మలి దశలో (2013-2015 ఆర్థిక సంవత్సరాల కాలం) 82 నుంచి 56కు, మూడో దశలో (2019-2021 ఆర్థిక సంవత్సరాల కాలం) 56 నుంచి 43కు వీటి సంఖ్యను కుదించారు.

అబద్ధాలు చెపుతామంటే ఊరుకునేది లేదు

- బీఆర్ఎస్ అక్రమ డబ్బుతో యూ ట్యూబ్ ఛానెల్స్ ను పెంచి పోషిస్తోంది

-జర్నలిస్ట్ ముసుగులో ఉన్న బీఆర్ఎస్ పెయిడ్ బ్యాచ్ కి మెట్టు సాయి కుమార్ హెచ్చరిక

హైదరాబాద్ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జర్నలిస్టుల ముసుగులో అబద్ధాలు చెపుతామంటే ఊరుకునేది లేదని జర్నలిస్ట్ ముసుగులో ఉన్న బీఆర్ఎస్ పెయిడ్ బ్యాచ్ కి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ హెచ్చరించారు. బీఆర్ఎస్ అక్రమ డబ్బుతో యూ ట్యూబ్ ఛానెల్స్ ను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. గురువారం గాంధీ భావన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని విమర్శించినా, తిట్టినా పర్లేదు జర్నలిస్టుల పేరుతో అబద్ధాలు ప్రచారం చేస్తామంటే ఊరుకోం అన్నారు. జర్నలిస్టుల ముసుగులో కొందరు బీఆర్ఎస్ తొత్తులు కాంగ్రెస్ పార్టీపై బురద చల్లుతున్నారు పొద్దునే లేస్తే చాలు ముఖ్యమంత్రిని ఎలా తిట్టాలి అనే ఆలోచిస్తున్నారు 33 యూ ట్యూబ్ ఛానెల్స్ పెడితే బాగుండని కేటీఆర్ అన్నారు యూ ట్యూబ్ ఉచ్చులో పడి ఇబ్బంది పడేది కేటీఆర్ మాత్రమేకొందరు జర్నలిస్టుల వల్లనిజమైన జర్నలిస్టుల పరువు పోతోందన్నారు.కొందరు జర్నలిస్టులు బీఆర్ఎస్ తొత్తులుగా, పేటీఎం బ్యాచులుగా, పెయిడ్ వర్కర్లుగా పనిచేస్తున్నారు జర్నలిస్టుల పేరుతోకొందరు చేస్తున్న అక్రమాలు మామూలుగా లేవుజర్నలిస్టుల పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రజలను కొందరు ఇబ్బందులు పెడుతున్నారుతెలంగాణ ఉద్యమంలోజర్నలిస్టుల పాత్ర మరవలేంఅమ్మాయిలను ఇబ్బంది పెట్టి కేసులైన వాళ్లు కూడా ప్రభుత్వం జర్నలిస్టుల గొంతు నొక్కుతోంది అంటే ఏం చేయాలి జర్నలిజం వ్యవస్థను కొందరు చిల్లర వ్యక్తులు దిగజారుస్తున్నారు.జర్నలిస్టులు సమాజ మంచికోసం ప్రాణాలు అడ్డుపెట్టి తెగించేవాళ్ళుకొందరు జర్నలిస్టులు కావాలంటే బీఆర్ఎస్ పార్టీలో చేరండి జర్నలిస్టుల ముసుగులో అబద్ధాలు చెపుతామంటే ఊరుకునేదని హెచ్చరించారు.

మెగా డీఎస్సీ నోటిపికేషన్ విడుదల కోరుతూ కలెక్టర్ ఆఫీస్ ముట్టడి

కర్నూల్, ఏప్రిల్ 10: తక్షణమే మెగా డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బిర్లా కాంపౌండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు గురువారం భారీగా ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో మొదటి సంతకం పెట్టి మొదటికే డీఎస్సీ అభ్యర్థులని మోసం చేశారని ఆరోపించారు. పది నెలలు గడిచినా మొదటి సంతకాన్ని అమలు చేసే దిక్కు లేదని, ఇలాంటప్పుడు వారంలో మెగా డీఎస్సీ అని ముఖ్యమంత్రి, త్వరలోనే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికి పదిసార్లు ప్రకటనలు చేసి నిరుద్యోగులను మోసం చేశారని తెలిపారు.

అందుకే ఈరోజు కర్నూలు జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులందరూ మోసం చేశారు మమ్మల్ని అంటూ వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ, జిల్లా మొత్తం అభ్యర్థులందరికీ ఒకే పేపర్ ఉండేలాగా పరీక్షలు నిర్వహించాలని, రోజుకో మాట చెప్పి నిరుద్యోగులను మోసం చేయొద్దని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగవలసి వచ్చిందని తెలిపారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేసినా పట్టించుకోకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్కడికి వెళితే అక్కడే ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ.. నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన నినాదాలు చేసినా కలెక్టర్ బయటికి రాకపోవడంతో నిరుద్యోగుల ఆందోళనకు దిగవలసి వచ్చింది. మూడో పట్టణ సీఐ కలగజేసుకొని డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ బయటికి పిలిచి వినతిపత్రం అందించారు. అయినా సరే నిరుద్యోగులు కలెక్టర్ బయటికి రావాల్సిందే అంటూ మూడు గంటల పాటు కలెక్టర్ గేటు ముందు ఆందోళనకు దిగారు. చివరికి పదిమంది నిరుద్యోగులను కలెక్టర్ ను కల్పిస్తామని పోలీసులు హామీ ఇచ్చి తీసుకెళ్లడంతో నిరుద్యోగులు ఈ ఉద్యమం ఆరంభం మాత్రమే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప నిరుద్యోగ ఉద్యమానికి అండగా ఉంటామని డీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్లా, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ భాష, నిరుద్యోగ నాయకులు చంద్రశేఖర్, వినయ్, జగన్ మోహన్, 500మంది డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను అరికట్టేందుకే కొనుగోలు కేంద్రాలు- షబ్బీర్ అలీ

నిజామాబాద్, ఏప్రిల్ 10:బహిరంగ మార్కెట్లో దళారీ వ్యవస్థను అరికట్టేందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ చెప్పారు. గురువారం బిక్కనూర్ మండల కేంద్రంలో సొసైటీ అధ్యక్షులు భూమయ్య ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వారం రోజుల్లోగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు ఉపాధ్యక్షులు స్వామి, సొసైటీ ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశం, మాజీ ఎంపీపీ గాల్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు: డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆనంద్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజల కోసం ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. సన్న బియ్యం పంపిణీతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కొత్తపల్లి మండల పరిధిలోని నిడ్జింత గ్రామంలోని ఒక రేషన్ దుకాణంలో ఒక లబ్ధిదారుడు రేషన్ బియ్యం బస్తా ఇంటికి తీసుకుపోయి పరిశీలించి దొడ్డు బియ్యం ఉందని గమనించి తిరిగి రేషన్ షాపుకి తీసుకువచ్చి సన్న బియ్యం బస్తా తీసుకెళ్లాడు. లబ్ధిదారులు రేషన్ బియ్యం కోసం వెళ్తే అక్కడ సన్న బియ్యం, దొడ్డు బియ్యం మిక్సింగ్ అయి రావడం జరిగింది. దొడ్డు బియ్యం వస్తున్నదని ప్రశ్నించగా.. దొడ్డు బియ్యం వస్తే పై అధికారులు పక్కన పెట్టమన్నారని రేషన్ డీలర్ తెలిపారు. సన్న బియ్యంలో దొడ్డు బియ్యం వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ రేషన్ బియ్యంకు అడ్డుకట్ట వేయడానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలిపారు. రేషన్ దందాను అరికట్టడానికి రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడంతోనే కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారిని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని అవసరాల కోసం వినియోగించాలని, విక్రయించకూడదని తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు, విక్రయిచినట్లు గుర్తిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, వారి రేషన్ కార్డు తొలగిస్తామని హెచ్చరించారు.

లబ్ధిదారులకు ఇచ్చే రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగితే డీలర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేషన్ దుకాణంకు బియ్యం లోడ్ వచ్చినపుడు సన్న బియ్యంలో దొడ్డు బియ్యం పొరపాటున వస్తే వెంటనే స్థానిక తహసీల్దార్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీ ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జీలకు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని, లేదంటే రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెదడు స్ట్రోక్ కు గురైన బాదితునికి మెరుగైన చికిత్స కోసం వెస్సో ట్రస్ట్ ఆర్థిక సహాయం

కాకినాడ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కాకినాడ ఇంద్ర పాలెంనివాసి పెదపాటి సత్యవతి (53) ఇటీవల మెదడు స్ట్రోక్ కు గురై మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. గత సంవత్సరం ఆమె బ్రెస్ట్ క్యాన్సర్ బారినపడి శస్త్ర చికిత్స, కీమోథెరపీ మరియు రేడియేషన్ చికిత్స చేయించుకొని ఆర్థికంగా చితికిపోయారు.బధిరులైన ఆమె భర్తరోజువారీ కూలీగా చెక్క పని చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు వివాహిత కుమార్తెలు. తల్లి వైద్యం కోసం కుమార్తెలు అప్పులు చేసి సహాయం చేసినప్పటికీ, అధిక వైద్య ఖర్చులను భరించలేక పోతున్నారు. అట్టి పరిస్థితుల్లో స్థానిక నాయకుల ద్వారా వెస్సో ట్రస్ట్ ను సంప్రదించి ఆర్థిక సహాయం కోరారు.వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో ఆమెకు 47,500/-ల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ వరుస అనారోగ్యాలతో బాధపడుతూ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సత్యవతి కి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించి ఆదుకొన్న గౌరవ దాతలకు పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

2025-2026 కాలానికి ప్రధానమంత్రి కృషి సించాయి యోజన ఉప పథకంగా కమాండ్ ఏరియా డెవలప్మెంట్, వాటర్ మేనేజ్మెంట్ ఆధునికీకరణకు క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్.. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్ వై) ఉప పథకంగా 2025-26 కాలానికి కమాండ్ ఏరియా డెవలప్మెంట్, వాటర్ మేనేజ్మెంట్ (ఎం-సీఏ డీడబ్ల్యూఎం) ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి ప్రాథమిక అంచనా వ్యయం రూ.1600 కోట్లు.

సాగునీటి సరఫరా వ్యవస్థను ఆధునికీకరించడం ద్వారా.. ప్రస్తుతము న్న కాల్వలు, ఇతర నీటి వనరుల నుంచి నిర్దేశిత ఆయకట్టు ప్రాంతానికి సాగునీటిని సరఫరా చేయడం ఈ పథకం లక్ష్యం. సూక్ష్మసేద్యం కోసం నీటి వనరుల నుంచి వ్యవసాయ క్షేత్రం దాకా.. భూగర్భ పీడనంతో కూడిన పైపు నీటి పారుదలతో ఒక హెక్టారు వరకు నీళ్లందించడం కోసం సహాయక మౌలిక సదుపాయ వ్యవస్థను ఇది బలోపేతం చేస్తుంది. వాటర్ అకౌంటింగ్, జల నిర్వహణ కోసం స్కాడా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీలను వినియోగిస్తారు. ఇది క్షేత్ర స్థాయిలో నీటి వినియోగ సామర్థ్యాన్ని.. వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలనూ తద్వారా రైతుల ఆదాయాన్నీ పెంచుతుంది.

సాగునీటి సంఘాలకు ఇరిగేషన్ నిర్వహణను అప్పగించి వనరులను సక్రమంగా నిర్వహించడం ద్వారా ప్రాజెక్టులు దీర్ఘకాలం మనుగడ సాగించగలుగుతాయి. సాగునీటి వినియోగ సంఘాలను ప్రస్తుత ఎఫ్ పీవో లేదా పీఏసీఎస్ వంటి ఆర్థిక సంస్థలతో ఐదేళ్ల పాటు అనుసంధానించడం కోసం చేయూతనిస్తారు. యువత కూడా వ్యవసాయం వైపు ఆకర్షితమై ఆధునిక నీటిపారుదల విధానాలను అవలంబిస్తారు.

రాష్ట్రాలకు ఛాలెంజ్ ఫండింగ్ ద్వారా దేశంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణంలో గ్రహించిన అంశాల ఆధారంగా.. 16వ ఆర్థిక సంఘం కాలానికి 2026 ఏప్రిల్ నుంచి కమాండ్ ఏరియా డెవలప్మెంట్, వాటర్ మేనేజ్మెంట్ కోసం జాతీయ ప్రణాళికను ప్రారంభిస్తారు.

ప్రపంచ హోమియోపతి దినోత్సవ సమావేశం

-దుష్ప్రభావాలు లేని సహజ వైద్య విధానం హోమియోపతి - ప్రముఖ హోమియో వైద్యులు డా: శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్ 10:ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి వైద్య విధానానికి అధిక ప్రజాదరణ ఉందని, సహజ ప్రకృతి వనరుల నుంచి సేకరించిన ఔషధాలతో రోగ కారణ మూలాలను గుర్తించి ఖచ్చితమైన వైద్యం అందించేందుకు హోమియోపతి ఉపయుక్తంగా ఉంటున్నదని, ఈ విధానంలో హోమియో ఔషధాలు వాడడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని నగర ప్రముఖ హోమియోపతి వైద్యులు డా శ్రీనివాస్ అన్నారు. ఈ రోజు లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్రపంచ హోమియోపతి దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాలక్రమంలో హోమియోపతి వైద్యంలో సకారాత్మక మార్పులు రావడంతో రోజు రోజుకు హోమియో పై ప్రజలకు నమ్మకం పెరగడం హర్షణీయమని అన్నారు. లీడ్ ఇండియా అధ్యక్షుడు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ హోమియోపతి పితామహుడు డా: శామ్యూల్ హెన్‌మన్ చొరవతో వెలువడిన హోమియోపతి వైద్య విధానంలో ఆధునిక పరిశోధనల ఫలితంగా మెరుగైన వైద్య సేవలు అందించబడుతున్నాయని, ప్రజలకు ఈ వైద్య పట్ల క్రమంగా నమ్మకం పెరుగుతున్నదని హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నంన్న కార్యదర్శి డా: ఎన్ మనోహరాచారి, కార్యవర్గ సభ్యులు మహేందర్‌లు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా హోమియోపతి వైద్యుల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషదాయకం అని అన్నారు. తర్వాత డా శ్రీనివాస్‌ను లీడ్ ఇండియా బాధ్యులు ఘనంగా సన్మానించారు.

కత్తితో రెచ్చిపోయిన ప్రేమోన్మాది

-బాలికకు పెళ్లి సంబంధాలు చూస్తున్న కుటుంబం

-ఇంట్లోకి చొరబడి తల్లి, కుమార్తెపై యువకుడి దాడి

-బాధితుల ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం , ఏప్రిల్ 10: విశాఖపట్నంలో ప్రేమోన్మది రెచ్చిపోయాడు. మధురవాడలో జరిగిన దాడి ఘటన మరువక ముందే గురువారం మరో ఘటన చోటుచేసుకుంది. దీంతో విశాఖ నగరం ఉలిక్కిపడింది.. తాజా ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గాజువాకకు చెందిన యువకుడు అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బాలికను ఏడాది నుంచి ప్రేమిస్తున్నాడు.. వీరిద్దరూ ఇంటర్ చదువుతున్నారు.. ఈ విషయం బాలిక ఇంట్లో తెలియడంతో వేరే పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడు బాలిక ఇంట్లోకి చొరబడి తల్లి, కూతురుపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేశాడు.. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు.. యువకుడి దాడి నుంచి కాపాడాలని కేకలు వేయడంతో అక్కడి నుంచి యువకుడు పారిపోయాడు. బాధితులను స్థానికులు ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని కత్తి స్వాధీనం చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు.

పంజాబ్, హర్యానాలో మిశ్రమ వార్షిక చెల్లింపు విధానంలో రూ. 1878.31 కోట్లతో 19.2 కి.మీ. పొడవైన 6 వరుసల రద్దీ రహిత జిరాక్‌పూర్ బైపాస్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ.. పంజాబ్, హర్యానాల్లో ఎన్‌హెచ్ (ఓ) కింద, మిశ్రమ వార్షిక చెల్లింపు విధానంలో ఆరు వరుసల జిరాక్‌పూర్ బైపాస్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. జాతీయ రహదారి-7 (జిరాక్‌పూర్-పటియాలా) జంక్షన్ నుంచి మొదలై జాతీయ రహదారి-5 (జిరాక్‌పూర్-పర్వనూ) జంక్షన్ వద్ద ముగుస్తుంది. దీని మొత్తం పొడవు 19.2 కి.మీ. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక కింద సమగ్ర రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా ఇదొక ముఖ్యమైన ముందడుగు.

జిరాక్పూర్ బైపాస్ జిరాక్పూంలోని ఎన్‌హెచ్ -7 (చండీగఢ్-బటిండా) జంక్షన్ నుంచి ప్రారంభమవుతుంది. పంజాబ్ ప్రభుత్వ బృహత్ప్రణాళికను అనుసరిస్తూ.. హర్యానాలోని పంచకులలో ఎన్‌హెచ-5 (జిరాక్‌పూర్ - పర్వానూ) జంక్షన్ వద్ద ముగుస్తుంది. అలా, పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న రద్దీతో కూడిన పంజాబ్‌లోని జిరాక్‌పూర్, హర్యానాలోని పంచకుల ప్రాంతాలను తప్పిస్తుంది.

పాటియాలా, ఢిల్లీ, మొహాలి ఏరోసిటీ నుంచి ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా జిరాక్‌పూర్, పంచకుల, పరిసర ప్రాంతాల్లో రద్దీని తగ్గించడం దానితోపాటు హిమాచల్ ప్రదేశ్‌కు నేరుగా అనుసంధానాన్ని కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఎన్‌హెచ్-7, ఎన్‌హెచ్-5, ఎన్‌హెచ-152 ప్రదేశాల్లో రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రయాణాన్ని సులభతరం చేయడం ప్రస్తుత ప్రతిపాదన లక్ష్యం.

చండీగఢ్, పంచకుల, మొహాలి నగర పరిధిలో రద్దీని తగ్గించడం కోసం ప్రభుత్వం రహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. పటంలో సూచించిన విధంగా అది రింగ్ రోడ్డు ఆకృతిలో రూపు దిద్దుకుంటుంది. ఈ ప్రణాళికలో జిరాక్‌పూర్ బైపాస్ ఒక ముఖ్యమైన భాగం.

నిబంధనల ప్రకారం నర్సింగ్ కళాశాలల నిర్వహణ ఉండాలి: మంత్రి సత్యకుమార్

అమరావతి ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్): నిబంధనల ప్రకారం నర్సింగ్ కళాశాలల నిర్వహణ ఉండాలని విద్య, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. నర్సింగ్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ తో సమావేశం నిర్వహించామన్నారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. కళాశాలకు అనుబంధంగా ఆసుపత్రి కచ్చితంగా ఉండాలని చెప్పారు. నర్సింగ్ విద్యార్థుల ఉపాధిపై జర్మనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, నెలకు రూ. 2.5 వేతనంతో జర్మనీలో ఉద్యోగం లభిస్తుందని సత్యకుమార్ పేర్కొన్నారు.


చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్
శ్రీకేతనమ్, 27-1-167, ఆదిత్య నగర్, నెల్లూరు - 2.
ద్వితీయ అక్షరోత్సవం
తేది: 13-4-2025, ఆదివారం
సమయం: సాయంత్రం 5 గం.లకు
వేదిక: పురమందిరము ఏ/సి హాలు
కవి సమ్మేళనం - సాహిత్య సదస్సులు
సభాధ్యక్షులు
శ్రీ తుంగా శివప్రభాత్‌రెడ్డి
సంపాదకులు, 'లాయర్' వార్తాపత్రిక, నెల్లూరు.
ముఖ్యఅతిథి
శ్రీ షేక్ అబ్దుల్ అజీజ్
చైర్మన్, ఏ.పి. పక్కీర్స్ - నెల్లూరు.
విశిష్ట అతిథి
డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్
అధ్యక్షులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం - నెల్లూరు.
గౌరవ అతిథి
శ్రీ బయ్యా శ్రీనివాసులు
శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత
ఆత్మీయ అతిథులు
డాక్టర్ జి.వి.పూర్ణచందు
ప్రముఖ రచయిత, విజయవాడ
శ్రీ కలిమిశ్రీ
సంపాదకులు, నవ మల్లెతీగ, విజయవాడ
శ్రీమతి గోవిందరాజు సుభద్రాదేవి
అధ్యక్షులు, పిన్నా రచయితల సంఘం
గౌరవ సలహాదారులు
శ్రీ శ్రీరామకవచం సాగర్
ప్రముఖ కవి, నవలాకారులు - ఒంగోలు
డాక్టర్ జరం సుందరరావు
ప్రముఖ కవి, విమర్శకులు

వైభవంగా శ్రీవారి వసంతోత్సవాలు ప్రారంభం

తిరుమల, ఏప్రిల్ 10: తిరుమల లోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు గురువారం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. వసంత రుతువులో శ్రీ మలయప్పస్వామి వారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఎండ వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని ఉపశమనోత్సవం అని కూడా అంటారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతో పాటు పలురకాల మధుర ఫలాలను స్వామివారికి నివేదిస్తారు. ఈ వేడుకల కోసం ఆకర్షణీయంగా మండపాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు. ఉదయం ఆస్థానం చేపట్టారు.

వైభవంగా స్నపనతిరుమంజనం..

వసంతోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు శ్రీ భూ సమేత మలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి (పెరుగు), మది (తేనె), నారికేళం (కొబ్బరినీళ్లు), వారిధారోదకం(వన్నెపు), గంధోదకం(గంధం) తో స్నపనం నిర్వహించారు. వీటితో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాశాంతిఖ్యాభిషేకాలను వైఖనసాగమోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడి నుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.

నేడు స్వర్ణరథోత్సవం..

వసంతోత్సవాల్లో రెండవ రోజైన ఏప్రిల్ 11న ఉదయం 8 నుండి 10గంటల వరకు శ్రీభూ సమేత శ్రీ మలయప్ప స్వామి వారు స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈకార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవ్‌కార్ మహామంత్రం కేవలం ఒక మంత్రం కాదు, మన విశ్వాసాలకి అది కేంద్ర బిందువు: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో ఈరోజు ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవ్ కర్ మహామంత్ర దివస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానసిక శాంతిని, స్థిరచిత్తాన్ని అందించే సామర్థ్యం గల నవ్ కర్ మంత్రం.. దివ్యమైన ఆధ్యాత్మిక అనుభూతిని ప్రసాదిస్తుందని అన్నారు. మంత్ర పఠనం వల్ల సిద్ధించే నిర్వికార స్థితి మాటలకు, ఆలోచనలకు అతీతమైనదని, చేతనలో, అంతరాత్మలో ఆ భావన స్థిర నివాసం ఏర్పరుచుకుంటుందని అన్నారు. పవిత్రమైన నవ్‌కార్ మంత్రంలోని పంక్తులను చదివి వినిపించిన శ్రీ మోదీ– సంయమనం, స్థితప్రజ్ఞత, మనస్సుు–అంతరాత్మల మధ్య సమన్వయం సాధించే నిరంతరాయ శక్తిప్రవాహంగా మంత్రశక్తిని అభివర్ణించారు. తన సొంత ఆధ్యాత్మిక అనుభూతిని గురించి చెబుతూ, నవ్ కర్ మంత్రం ఇప్పటికీ తన అంతరాళాల్లో ప్రభావాన్ని చూపుతూనే ఉందన్నారు. కొన్నేళ్ళ కిందట బెంగుళూరులో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో జరిగిన సామూహిక మంత్ర పఠన ప్రభావం ఇప్పటికీ తనని వీడి పోలేదన్నారు. దేశ విదేశాల్లోని పవిత్ర హృదయాలు ఒకే చైతన్యంతో ఒక సామూహిక అనుభవంలో భాగమవడం తిరుగులేని అనుభూతి అని సంతోషం వెలిబుచ్చారు. ఈ సామూహిక చర్య ద్వారా ఒకే లయలో ఒదిగే పంక్తుల పఠనం అసాధారమైన శక్తిని వెలువరించి మాటల్లో చెప్పలేని దివ్యానుభూతిని కలిగిస్తుందని శ్రీ మోదీ చెప్పారు.

జైన మాట పరివ్యాప్తి ప్రతి వీధికీ చేరిన గుజరాత్ రాష్ట్రంలో తన మూలాలు ఉన్నాయన్న ప్రధాని, ఈ కారణం చేతనే చిన్నప్పటి నుంచి జైన ఆచార్యుల సాంగత్యం తనకు లభించిందని చెప్పారు. "నవ్‌కార్ మంత్రాన్ని ఒక మంత్రంగా మాత్రమే చూడలేం. అది మన విశ్వాసాలకి కేంద్ర బిందువు, జీవన సారం..." అని చెప్పారు. మంత్ర ప్రాముఖ్యం ఆధ్యాత్మిక పార్శ్వానికి మించినదని, సమాజానికి, వ్యక్తులుకీ పథ నిర్దేశనం చేస్తుందని చెప్పారు. నవ్‌కార్ మంత్రంలోని ప్రతి పాదం, ప్రతి పదం అనంతమైన అర్థాన్ని కలిగి ఉందన్నారు. మంత్రాన్ని పఠించే సమయంలో మనసులో పంచ పరమేష్ఠిని ప్రతిష్ఠాపించు కుంటామంటూ ఆ వివరాలను తెలియజేశారు. "కేవల జ్ఞానాన్ని" పొందిన అరిహంత్‌లు భవ్య జీవులకు మార్గం చూపుతారని, వీరు 12 దివ్య లక్షణాలను కలిగి ఉంటారని, ఇక అష్టకర్మలను రూపుమాపి మోక్ష ప్రాప్తి పొందిన సిద్ధులు ఎనిమిది పరిశుద్ధమైన లక్షణాలను కలిగి ఉంటారని విశదీకరించారు. మహావ్రతుణ్ణి అనుసరించే ఆచార్యులు 36 సుగుణాలను కలిగి ఉంటారని, వీరు పథగాములని, ఇక మోక్ష మార్గాన్ని గురించి ఎరుక కలిగించే ఉపాధ్యాయులు 25 సుగుణాలను కలిగి ఉంటారని చెప్పారు. ఆ మహాత్ముల ఆధ్యాత్మిక సాంద్రత, వారికి అనుబంధంగా ఉన్న దివ్యమైన లక్షణాలను గురించి ప్రధాని తెలియజేశారు.

"నవ్‌కార్ మంత్రాన్ని పఠించే సమయంలో 108 దివ్య గుణాలకి నమస్కరించి, సర్వ మానవాళి సంక్షేమం కోసం ప్రార్థిస్తాం" అని శ్రీ మోదీ గుర్తు చేశారు. జ్ఞానం, కర్మ, ఈ రెండు మాత్రమే జీవితంలో నిజమైన దిశలని, మన హృదయంలో సాక్షాత్కరించే బాట గురువు కృప, మార్గదర్శనం వల్ల ఏర్పడుతుందన్న విషయాలు మంత్రాన్ని పఠించేటప్పుడు మనకు అవగతమవుతాయని అన్నారు. నవ్‌కార్ మంత్ర ప్రబోధాలు ఆత్మ విశ్వాసాన్ని కలుగజేసి సొంత బాటపై పయనాన్ని ప్రారంభించేందుకు ప్రోద్బలాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతికూల ఆలోచనలు, అపనమ్మకం, విరోధ భావనలు, స్వార్థం వంటివి మన లోపల నివసించే అసలైన శత్రువులని, వాటిపై గెలుపే సిసలైన విజయమని అన్నారు. బాహ్య ప్రపంచంపై నియంత్రణ కన్నా, అంతర్ ప్రపంచాన్ని జయించాలని జైన మతం ప్రబోధిస్తుందని మోదీ చెప్పారు. ''తమపై తాము గెలిచినవారు అరిహంత్ లుగా మారుతారు'' అన్నారు. నవ్‌కార్ మంత్రం లౌకికపరమైన కోర్కెలు తీర్చే సాధనం కాదని, మనిషి అంతరాత్మను శుద్ధి చేసి, వారిని మైత్రి, సమాభావనల వైపు నడిపించే సూత్రమని అన్నారు.

ధ్యానం, అభ్యాసం, ఆత్మశుద్ధికి అత్యంత అనువైన నవ్‌కార్ మంత్రం కాలానికి, సరిహద్దులకు అతీతమైనదని, ఇతర భారతీయ మౌఖిక, పుణ్య గ్రంథాల మాదిరిగానే తొలుత అనుశ్రుతంగా, తరువాతి కాలంలో లిఖిత రూపంలో ? శాసనాలు, అనతి కాలంలో ప్రాకృత తాళపత్ర గ్రంథాల రూపంలో – ఒక తరం నుంచి మరో తరానికి అందిన సంపద అని చెప్పారు. నేటికీ ఈ మంత్రం మానవాళికి దారి చూపుతోందని వ్యాఖ్యానించారు. "పంచ పరమేష్ఠి ఆరాధన సహా నవ్‌కార్ మంత్రం సవ్యమైన జ్ఞానానికి, దృక్కోణానికి, ప్రవర్తనకి ప్రతిరూపమై ముక్తి మార్గాన్ని సూచిస్తోంది" అన్నారు. మానవ జీవితంలోని తొమ్మిది మూలకాలు సంపూర్ణత్వానికి దారితీస్తాయంటూ, ఈ సందర్భంగా భారతీయ తత్వంలో తొమ్మిది సంఖ్యకు గల ప్రాముఖ్యాన్ని ప్రస్తావించారు. జైన మతంలో 'తొమ్మిది' సంఖ్య ఎంతో ప్రత్యేకమైనదని, నవ్‌కార్ మంత్రం, నవ మూలకాలు, నవ సుగుణాలు వంటి అంశాలను ఉదాహరించారు. అదే విధంగా నవ సంపదలు, నవ ద్వారాలు, నవగ్రహాలు, నవదుర్గలు, నవవిధ భక్తి మార్గాలు వంటి ఇతివృత్తాలు ఇతర భారతీయ సంప్రదాయాల్లో అంతర్భాగమని గుర్తు చేశారు. మంత్ర పారాయణ సమయంలో ఆచరించే తొమ్మిది సార్ల పఠనం, తొమ్మిది గుణకాలైన 27, 54, 108 వంటి సంఖ్యలు 'నవ' సంఖ్య పరిపూర్ణతను ఆవిష్కరిస్తాయన్నారు. తొమ్మిది సంఖ్య గణితశాస్త్రానికి పరిమితమైనది కాదని, పరిపూర్ణతను సూచించే సిద్ధాంతమని చెప్పారు. పరిపూర్ణతను సాధించిన మనసు, బుద్ధి, నిశ్చలతను సాధించి, కొత్త వస్తువులు, అనుభూతులు, వాంఛల చట్రం నుంచి విముక్తి పొంది ఉన్నతమైన స్థితికి చేరుకోగలవని చెప్పారు. లౌకికపరమైన అభివృద్ధిని సాధించిన తరువాత కూడా ఈ జ్ఞానాన్ని మనసులో నిలుపుకునే ప్రజ్ఞను మంత్రం కలిగిస్తుందని, అదే నవ్‌కార్ మంత్ర మహిమ అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

నవ్‌కార్ మంత్ర మూల సిద్ధాంతం భారత్ ను సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణమైనదని శ్రీ మోదీ చెప్పారు. ఈ సందర్భంగా తన ఎర్రకోట ప్రసంగాన్ని గుర్తు చేస్తూ, అభివృద్ధి చెందిన భారత్ ప్రగతి సాధించినప్పటికీ వారసత్వాన్ని మరువదని, తొట్రుపాటు లేకుండా మున్ముందుకు దూసుకువెళుతుందని, అభివృద్ధి పథంలో పైకి ఎగబాకినప్పటికీ సంప్రదాయ మూలాలను మరువదని చెప్పారు. అభివృద్ధి చెందిన భారత్ తన సంస్కృతిని చూసి గర్విస్తుందన్నారు. ఈ సందర్భంగా తీర్థంకరుల బోధనల పరిరక్షణ గురించి ప్రస్తావించారు. మహావీర జైనుని 2550వ నిర్వాణ మహోత్సవాన్ని గుర్తు చేసుకుంటూ, విదేశాల నుంచి తీర్థంకరుల ప్రతిమలు సహా అనేక ప్రాచీన శిల్పాలు తిరిగి భారత్ చేరుకున్నాయన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో 20కి పైగా తీర్థంకరుల విగ్రహాలు దేశానికి తిరిగివచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. దేశ విలక్షణతను తీర్చిదిద్దడంలో జైన మత పాత్ర సాటిలేనిదని, ఈ మహోన్నత ధర్మాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజాస్వామ్య ఆలయమైన నూతన పార్లమెంటు భవన నిర్మాణ శైలిని ప్రస్తావిస్తూ, జైన మత సంప్రదాయాల ప్రభావం నున్నన్నమని వ్యాఖ్యానించారు. శార్దూల్ ద్వారం వద్ద గల వాస్తుకళ మందిరంలోని సమ్మేద్ శిఖర్, లోక్ సభ ద్వారం వద్ద ఆస్ట్రేలియా నుంచి తిరిగివచ్చిన తీర్థంకరుని ప్రతిమ, కాన్స్టిట్యూషన్ గ్యాలరీ పైకప్పు పై చిత్రీకరించిన అద్భుత మహావీరుని చిత్తరువు, సౌత్ బిల్డింగ్ గోడపై గల 24 తీర్థంకరుల కుడ్య చిత్రాల గురించి ప్రధాని గుర్తు చేశారు. భారత్ దేశ ప్రజాస్వామ్యానికి జైనం వంటి ఆధ్యాత్మికతలు మార్గ నిర్దేశం చేస్తాయన్నారు. "వత్తు సహావో ధమ్మో", "చరిత్తం ఖలు ధమ్మో", "జీవన రక్షనం ధమ్మో" వంటి ఆగమాల్లో ఉల్లేఖించిన జైన సిద్ధాంతాల లోతైన నిర్వచనాలని ఉటంకించారు. ఈ సూత్రాల స్ఫూర్తితో 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే ఆశయంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీ నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

"భారత మేధో వారసత్వానికి వెన్నెముకగా జైన సాహిత్యం నిలిచింది... ఈ జ్ఞానాన్ని పరిరక్షించుకోవడం మన కర్తవ్యం" అని శ్రీ మోదీ అన్నారు. ప్రాకృత భాషకూ, పాలీ భాషకూ శాస్త్రీయ భాష హోదాను ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన ప్రధానంగా చెబుతూ, జైన సాహిత్యం గురించి మరింత పరిశోధన చేసే అవకాశం దీంతో లభిస్తుందన్నారు. భాషను సంరక్షించుకొంటే జ్ఞానం మనగలుగుతుందనీ, భాషను విస్తరించినందువల్ల జ్ఞానం వృద్ధి చెందగలదన్నారు. జైన చేతిరాత పుస్తకాలు వందల సంవత్సరాల నుంచి భారత్‌లో ఉన్నాయన్న సంగతిని ప్రధాని చెబుతూ, లోతైన జైన ధర్మ ప్రభోధాల్లోని ప్రతి పేజీ చరిత్రకు అద్దంపట్టడమేకాక జ్ఞాన సాగరం లాంటివని అభివర్ణించారు. అనేక మహత్తర గ్రంథాలు మెల్లమెల్లగా అంతరించిపోతుండడం పట్ల ఆయన ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం బడ్జెటులో ప్రకటించిన 'జ్ఞాన్ భారతం మిషన్'ను ప్రారంభించిన సంగతిని ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా లక్షలాది చేతిరాత పుస్తకాల సర్వేను చేపట్టి, ప్రాచీన వారసత్వాన్ని డిజిటలీకరించే ప్రణాళికలు కూడా ఉన్నాయని వెల్లడిస్తూ, ఈ పనులతో ప్రాచీనతను ఆధునికతతో జోడించవచ్చన్నారు. ఈ కార్యక్రమం ఒక "అమృత సంకల్పం" అని ఆయన అభివర్ణించారు. "న్యూ ఇండియా ఆధ్యాత్మికతతో ప్రపంచానికి మార్గదర్శనం చేస్తూనే కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా అవకాశాలను అన్వేషిస్తూ ఉంటుంద"ని ఆయన స్పష్టం చేశారు.

జైన ధర్మం శాస్త్రీయవిజ్ఞానం, సూక్ష్మగ్రాహ్యత.. ఈ రెండిటినీ కలబోసుకొందని ప్రధాని అన్నారు. జైన ధర్మం తన మూల సిద్ధాంతాల ద్వారా యుద్ధం, ఉగ్రవాదం, పర్యావరణ సంబంధిత అంశాల వంటి ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను అందిస్తోందని ఆయన చెప్పారు.



కట్నం కోసం ఓ మహిళని దారుణంగా భర్త హత్య

నెల్లూరు ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కట్నం కోసం ఓ మహిళని దారుణంగా భర్త, అత్తమామ, ఆడపడుచ దారుణంగా హింసించి హత్య చేసిన ఘటన నెల్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భర్త హరికృష్ణ తన తల్లిదండ్రులు నాగోరు, నర్సమ సోదరి నాగలక్ష్మితో కలిసి తన భార్యను కట్నం కోసం హింసించేవాడు. దీంతో బాధితురాలు ఆమె తల్లిదండ్రులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించింది. అయితే తాజాగా ఆమెపై మరోసారి దాడి చేశారు. ఈసారి ఆమె ఫిర్యాదు చేయకుండా రంగునీళ్లు తాగించి ఊపిరి ఆడకుండా చేశారు. అనంతరం వివస్త్రను చేసి దారుణంగా కొట్టి హతమార్చారు. ఈ అమానవీయ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ డిఎస్పి దీనిపై విచారణ చేపట్టారు.

రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొని ఇద్దరు మృతి

నల్గొండ, ఏప్రిల్ 10: రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొన్న రెండు వేర్వేరు ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు.

ఈ దుర్గటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం బాబాసాయిగూడెం స్టేజీ సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కనగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సింగం కొండల్‌కు చెందిన ట్రాక్టర్ వరి ధాన్యం తీసుకుపోతుండగా పంక్చర్ కావడంతో బాబాసాయి గూడెం సమీపంలో రోడ్డుపై నిలిపి వెళ్లాడు.

గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన బలుగూరి శేఖర్ (43) మిర్యాలగూడలోని చెన్నై షాపింగ్ మాల్ లో పనిచేస్తూ రాత్రి 11 గంటల సమయంలో తన సొంత గ్రామానికి బైక్ పై వెళ్తున్నాడు. ఆ సమయంలో రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కు కనిపించకపోవడంతో దాన్ని ఢీకొట్టాడు.

ఈ ప్రమాదంలో శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శేఖర్ మృతిచెందాడు.

అదే రాత్రి అనుముల మండలం బొట్టువారి గూడెం గ్రామానికి చెందిన చింతకాయల కిరణ్ (32) హోలియా నుంచి నల్లగొండకు వస్తున్న క్రమంలో అదే ట్రాలీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మృతులిద్దరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

ఒక్కో సర్కిల్లో.. ఒక్కోలా నిబంధనలా.. జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై ఎమ్మెల్యే కృష్ణారావు ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 10:కూకట్‌పల్లి నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ అధికారుల అసమగ్ర విధానాలతో భవన నిర్మాణదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలను, భవనాలను సీజ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని హెచ్చరించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, అడిషనల్ సీసీపీ, కూకట్‌పల్లి జోనల్ అధికారుల దృష్టికి భవన నిర్మాణదారుల సమస్యలను తీసుకెళ్లి వినతి పత్రాన్ని అందించారు.

అనంతరం ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 50 కి పైగా భవనాలను సీజ్ చేయడం బాధాకరమని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడలేని విధంగా కూకట్‌పల్లిలోనే అక్రమ నిర్మాణాలను సీజ్ చేయడం సరికాదని హితవుపలికారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఒక్కో సర్కిల్లో ఒక్కో విధానం అమలు చేయడం సరికాదని అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ కాలనీ పక్కన ఉన్న గోకుల్ ప్లాట్స్‌లో ఒకరకంగా.. బాలాజీ నగర్ డివిజన్ పక్కన ఉన్న అయ్యప్ప సొసైటీలో ఒక రకంగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కూకట్పల్లి నియోజకవర్గంలో అక్రమ నిర్మాణం అంటూ ఏకంగా భవనాన్ని సీజ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కనీసం అనుమతులు కూడా లేకుండా పక్క సర్కిల్‌లో నిర్మాణాలు చేపడుతున్నా చూసి చూడకుండా వదిలేస్తున్నారని.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మాత్రం సీజ్ చేస్తున్నారని మండిపడ్డారు. అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలను మాత్రమే సీజ్ చేయాలని , అనుమతి ఉన్న ఫ్లోర్లను సీజ్ చేయడం సరికాదని అన్నారు. జీహెచ్ఎంసీలోని అన్ని సర్కిళ్లలో ఒకే విధమైన పద్ధతులను అనుసరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజల కోసం ఉద్యమిస్తానని హెచ్చరించారు. అధికారులు డబ్బులు తీసుకొని కూడా భవనాలను సీజ్ చేస్తున్నారని, వసూళ్ల కోసం టీంలను ఏర్పాటు చేసుకొని నిర్మాణదారులను ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. నిర్మాణదారుల బాధను అర్థం చేసుకోవాలని సీజ్ చేసిన భవనాల సీజ్‌ను తొలగించాలని కోరారు. అదనపు అంతస్తులకు మాత్రమే సీల్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని, అనుమతుల మేరకు నిర్మించిన భవనాలను వినియోగించుకునేలా చూడాలని కోరారు.

ఎంజీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా : జి. ఉపేందర్ రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 10 : నల్లగొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఈ నెల 11, 15, 16న జరిగే డిగ్రీ పలు సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి గురువారం తెలిపారు. ఇప్పటికే వెల్లడించిన టైమ్ టేబుల్‌లో 16వ తేదీ తర్వాత జరగాల్సిన పరీక్షలన్నీ యధావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కోసం చేస్తున్న నిరవధిక నిరసనలో భాగంగా వారి వినతి మేరకు యూనివర్సిటీ వీసీ ఆదేశాలతో పరీక్షలు వాయిదా వేయడం జరిగిందన్నారు. వాయిదా పడిన పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఈ అంశాన్ని గమనించాలని కోరారు.

మిర్చి రైతు ఆత్మహత్యాయత్నం

–అప్పు తీర్చమని ఎరువుల వ్యాపారి ఒత్తిడి
–కళ్లం నుంచి మిర్చి బస్తాలు తీసుకెళ్లిన వైనం
–మనస్థాపానికి గురై పురుగుల మందు తాగిన రైతు

ఆదిలాబాద్, ఏప్రిల్ 10:ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన బొగటా నరసింహారావు అనే మిర్చి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుల మందు తాగిన ఆయన అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి కారణం ఇదే

రైతు నరసింహారావు రెండు ఎకరాలలో మిర్చిపంట సాగు చేశాడు. ఇందుకు గాను అదే గ్రామానికి చెందిన బుల్లె ప్రశాంత్ అనే ఎరువుల వ్యాపారి వద్ద రూ.90,000 అప్పుగా తీసుకున్నాడు. మూడేళ్లుగా మిర్చి దిగుబడి లేకపోవడం, ఈ ఏడాది మిర్చికి ధర లేకపోవడంతో అప్పు తీర్చలేకపోయాడు. వ్యాపారి ఒత్తిడి భరించలేక 15 బస్తాల మిర్చి ఇస్తానని, మిగతావి మరుసటి ఏడాది ఇస్తానని రైతు చెప్పాడు. అయితే ఆ వ్యాపారి వినకుండా కళ్లంలో ఉన్న మిర్చి బస్తాలను ట్రాక్టర్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లిపోయాడు. పంట మొత్తం వ్యాపారి తీసుకెళ్లడంతో మిగిలిన వారికి అప్పులు తీర్చడం కష్టమని రైతు నరసింహారావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు : చందూరు ఆర్డీఓ శ్రీదేవి

నల్గొండ, ఏప్రిల్ 10: రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం తెలిపిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని చందూరు ఆర్డీఓ శ్రీదేవి అన్నారు. నల్లగొండ జిల్లా చందూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు డీసీసీబీ కోడి సుష్మా వెంకన్నతో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్–ం కు రూ.2,320/–, గ్రేడ్–ః కు రూ.2,300/– ఉన్నట్లు తెలిపారు.

రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు రైతు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, భూమి పాస్ బుక్ వెంట తీసుకు రావాలన్నారు. తేమ 17 శాతం లోపు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే రైతులు తమ ఆధార్ కార్డుకి ఫోన్ నంబర్ తప్పకుండా లింక్ చేసుకుని ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ దశరథ, ఏఓ చంద్రిక, ఏఈఓ శోభ, రాకేశ్, సంఘ డైరెక్టర్లు కట్ట భిక్షం, బోడ ఆంజనేయులు, దోలె నర్సాజీ, అచ్చిన శ్రీనివాసులు, చెరుపల్లి ఆంజనేయులు, సంఘ సెక్రటరీ పాల్వాయి అమరేందర్ రెడ్డి, సిబ్బంది, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పర్సాయపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా వెంకన్న

అర్వపల్లి, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం పర్సాయపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా మిర్యాల వెంకన్న ఎంపికయ్యారు. గురువారం గ్రామంలో పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడిగా మ

హెచ్‌సీయూ భూములపై అప్పు ఇప్పించిన బ్రోకర్‌కు రూ. 170 కోట్ల లంచం

– మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్ ఏప్రిల్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: గతంలో హెచ్‌సీయూ భూములపై అప్పు ఇప్పించిన బ్రోకర్‌కు రూ. 170 కోట్ల లంచం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ అడ్వైజర్ కమిటీకి కంచ గచ్చిబౌలి భూములపై ఫిర్యాదును ఇచ్చిన అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. 2024 నవంబర్ 22న నాడు హెచ్‌సీయూ భూమిని తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పు తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇంకా దుర్మార్గం ఏంటంటే.. ఈ అప్పు ఇప్పించడానికి బ్రోకరుగా వ్యవహరించిన వ్యక్తికి రూ. 169 కోట్ల 83 లక్షల అంటే సుమారుగా 170 కోట్లు బ్రోకర్ ఫీజు ఇప్పించారు. నేనేదో ఉట్టిగా చెప్పడం లేదు. నేను అసెంబ్లీలో వేసిన ప్రశ్నకు.. రాతపూర్వకంగా ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానం ఇది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు ఆ భూమిని తెగనమ్మి ఇంకో 40 వేల కోట్లు తేవాలని ప్రయత్నం చేస్తుండు. నియమ నిబంధల్ని ఉల్లంఘిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎలాంటి చర్యలు, పనులు చేపట్టొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత కూడా ఇది టీజీఐఐసీకి చెందినవే అని బోర్డులు పెట్టారు. ఇది సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుంది. సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు అంటే కూడా భయం లేకుండా పోతున్నది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కొత్త సెక్రటేరియెట్‌ను కట్టాలని నిర్ణయం తీసుకుంటే, పదో ఇరవయ్యో చెట్లను నరుకుతున్నారని గ్రీన్ ట్రిబ్యునల్లో ఫిర్యాదు చేశారు రేవంత్ రెడ్డి. హైకోర్టు, సుప్రీంకోర్టులో కూడా కేసు వేశారు. ఇవాళ మీరేం చేస్తున్నారు రేవంత్ రెడ్డి గారూ.. వందల ఎకరాల్లో లక్షల కొద్దీ చెట్లు కొడుతున్న సీఎం గారిపై, సీఎస్ గారిపై, పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రశ్నించిన పాపానికి వారిని జైల్లో పెట్టారు, పది రోజులుగా వాళ్లు జైల్లో ఉన్నారు. దీనికి బాధ్యత హోం మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డిదే. వాళ్లను విడుదల చేయమని ఉప ముఖ్యమంత్రి చెబుతారు ఎందుకో మరి.. ప్రభుత్వం చేయాల్సిన పనిని విద్యార్థులు చేస్తే అరెస్టు చేసి, జైల్లో పెడతారా.. ప్రభుత్వం అన్ని చట్టాలనూ ఉల్లంఘిస్తున్నది. ఈ విషయాలన్నింటినీ మేం కమిటీకి నివేదించాం అని హరీశ్‌రావు తెలిపారు. డీజీపీ గారూ.. సీఎం గారిపై ఏ పోస్టు పెట్టినా వారిని జైల్లో పెడుతున్నారే.. మరి ఇవాళ వేలాది చెట్లు నరికినా, జింకలను చంపినా ఎందుకు కనిపించడం లేదు. జీవ విధ్వంసం మీ కళ్లకు కనిపంచడం లేదా.. ఎందుకు కేసులు పెట్టరు? నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతివారూ నేరస్తులే. అందరూ కలిసే నేరం చేశారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

పేదల జోలికి వస్తే సహించేది లేదు .. ఎమ్మెల్యే తలసాని వార్నింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 10:పేదల జోలికి వస్తే సహించేది లేదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సనత్ నగర్‌లోని దాసారంలో సుమారు 300 కుటుంబాలు గత 30 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా బుధవారం కొందరు వ్యక్తులు తమ ప్రాంతానికి తమ అనుచరులతో వచ్చి గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించారు. దీంతో ఆందోళనకు గురైన వారంతా గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో సంవత్సరాల నుండి తాము ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు తమను వెళ్లిపోవాలంటే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

బస్తీవాసుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్.. రెవెన్యూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. పేదల జోలికి రాకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

సీనియర్ సిటిజన్ రాయితీ ఎత్తివేయడంతో.. రైల్వేశాఖకు అయిదేళ్లలో అదనంగా రూ.8913 కోట్ల ఆదాయం

నల్గొండ, ఏప్రిల్ 10: రైళ్లలో సీనియర్ సిటీజన్లకు రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్లు వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. అయితే కోవిడ్ వల్ల మార్చి 20, 2020 నుంచి సీనియర్ సిటీజన్లకు ఆ రాయితీని ఎత్తివేశారు. అప్పటి నుంచి సీనియర్ సిటీజన్ల క్యాటగిరీలో, అంటే గత అయిదేళ్లలో రైల్వే శాఖకు అదనంగా 8913 కోట్ల ఆదాయం వచ్చినట్లు తేలింది. సమాచార హక్కు చట్టం కింద సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ డేటా నుంచి ఈ సమాచారాన్ని సేకరించారు. రైల్వేశాఖకు చెందిన టికెట్లు, ప్రయాణికుల వివరాలను సీఆర్ఐఎస్ మెంటేన్ చేస్తుంది.

రైల్వే శాఖ ప్రతి ప్రయాణికుడిపై 46 శాతం రాయితీ ఇస్తోందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2020, మార్చి 20 కన్నా ముందు.. రైల్వే టికెట్లపై 60 ఏళ్లు నిండిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం రాయితీ, 58 ఏళ్లు దాటిన మహిళలకు 50 శాతం రాయితీ కల్పించేవారు. సీఆర్ఐఎస్ డేటా ప్రకారం మార్చి 20, 2020 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు 31.25 కోట్ల మంది సీనియర్ సిటీజన్లు రైళ్లలో ప్రయాణించారు. రాయితీ ఎత్తివేయడం వల్ల ఆ ప్రయాణికుల నుంచి రూ. 8913 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆర్టీఐ సమాచారం ద్వారా వెల్లడైంది.

గత అయిదేళ్లలో 18.2 కోట్ల మంది పురుషులు, 13.06 కోట్ల మంది మహిళలు, 43 వేల మంది ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులు సీనియర్ సిటిజన్ కోటాలో ప్రయాణించినట్లు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ వేసిన పిటిషన్ ఆధారంగా ఈ సమాచారం బహిర్గతమైంది. పురుష ప్రయాణికుల ద్వారా 11,531 కోట్ల, మహిళా ప్రయాణికుల ద్వారా 8,599 కోట్లు ట్రాన్స్‌జెండర్ల ద్వారా 28 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మొత్తం ఆదాయం 29 వేల కోట్లు దాటింది. అయితే పురుషులకు చెందిన 40 శాతం, మహిళలకు చెందిన 50 శాతం రాయితీ తీస్తే ఆ మొత్తం అమౌంట్ నుంచి 8913 కోట్లు సీనియర్ సిటిజన్ కోటా నుంచి వచ్చినట్లు అవుతుందని చంద్రశేఖర్ తెలిపాడు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి : మాజీ విప్ రేగా కాంతారావు

ఖమ్మం, ఏప్రిల్, 10: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ఆపసోపాలు పడుతుందని విమర్శించారు. ఈ 15 నెలల కాలంలో రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, సబ్బండ వర్గాలు అనేక కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ వర్గాలను మోసం చేసి బూటకపు మాటలతో అరాచక పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ప్రజలంతా గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. అధికార మదంతో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఏ ఎన్నికైనా బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.

ఈ 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు దిండిగల రాజేందర్, తోగరు రాజశేఖర్, కాపు సీతాలక్ష్మి, బాదావత్ శాంతి, వేల్పుల దామోదర్, సంకుబాపన అనుదీప్, కొట్టి వేంకటేశ్వర్‌రావు, మంతపురి రాజుగౌడ్, కిలారు నాగేశ్వర్ రావు, బట్టు మంజుల, బత్తుల వీరయ్య, సింధు తపస్వి, టీబీజీకే ఎస్ రాష్ట్ర కార్యదర్శి కాపు కృష్ణ, అన్వర్ పాషా, మాధవీలత, నవతన్, మునీల, బత్తుల శ్రీను, హైమద్ పాల్గొన్నారు.

కాట్రేపల్లి గ్రామ రైతులను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10:నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం అధికారులు మక్తల్ మండలం కాట్రేపల్లి గ్రామంలో భూసేకరణ చేపడుతున్నారు. భూసేకరణ ఆపి రైతులను కాపాడాలని కోరుతూ గురువారం కాట్రపల్లి గ్రామ రైతులు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాట్రేపల్లి రైతులు కేశవ్ మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మక్తల్ మండలంలో చేపట్టిన భూత్పూర్ రిజర్వాయర్ లో కాట్రేపల్లి గ్రామానికి చెందిన రైతుల భూములు 90% కోల్పోయారన్నారు.

మిగిలిన 10% భూములను సైతం ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంతో భూములను కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. మిగిలిన భూమిని తీసుకునేందుకు అధికారులు వేగవంతంగా భూసేకరణ చేస్తున్నారని, ఆ 100 ఎకరాలు ఎత్తిపోతల పథకానికి తీసుకుంటే పూర్తిస్థాయిలో రైతులు నిర్వాసితులుగా మారే అవకాశం ఉందన్నారు. కాట్రేపల్లి గ్రామ రైతుల బాధలను అర్థం చేసుకొని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కి విన్నవించారు. కార్యక్రమంలో మహేష్, శివరాజ్, జిలానీ, రాజు, రఘు, నర్సింలు, గొల్ల బాలయ్య, గొల్ల కన్నయ్య ఉన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన డిఆర్డిఓ మధుసూదన్ రాజ్



మహబూబాబాద్, ఏప్రిల్ 10 (నేటినిజం ప్రతినిధి): తొర్రూర్ మండలం మడిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మహబూబాబాద్ జిల్లా డిఆర్డిఓ మధుసూదన్ రాజ్ సందర్శించి,పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడుతూ కనీస వేతనం 307/- రూపాయలు వచ్చే విధంగా పని ప్రదేశంలో కొలతల ప్రకారం పని చేయాలని వారు అన్నారు.పని ప్రదేశంలో నీటి సౌకర్యం, నీడ సౌకర్యాన్ని గ్రామపంచాయతీ నుంచి ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.మధు, ఇన్చార్జి ఈసీ కే కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బి సుధాకర్,ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, మేట్లు,కూలీలు పాల్గొన్నారు.

చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ ఆలయ అభివృద్ధికి కృషి

–ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్, ఏప్రిల్ 10:: మండలం చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ ఆలయ అభివృద్ధిక కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో షబ్బీర్‌అలీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం చాలా మహిమలు గలదన్నారు.

ఆలయానికి రోడ్డు మరియు కరంటు ఏర్పాటు చేసే భాగ్యం తనకే దక్కిందని అన్నారు. చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రతీ ఆదివారం జనాలతో కిక్కిరిసిపోతుందని, కోరుకున్న వారికి కొంగు బంగారం అవుతుందని ఆలయ అభివృద్ధికి నా వంతు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. వేసవికాలంలో భక్తులకు దాహార్తి తీర్చేందుకు బోరు మోటరు ఆఫీస్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, నాసీ నాయక్, అనంతరెడ్డి, రమేష్ గౌడ్, సుతారి రమేష్, నా రెడ్డి మోహన్ రెడ్డి, పండ్ల రాజు, ఐరేని సందీప్, గుడుగుల శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, చందు, పుట్నాల శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, నిమ్మ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి పింఛన్ డబ్బుల కోసం 68 ఏళ్ల అక్కను చంపేసిన వృద్ధుడు

హైదరాబాద్, ఏప్రిల్ 10:రామా.. కృష్ణ.. అంటూ ఇంట్లో కూర్చోవాల్సిన వయసులో తండ్రి పింఛన్ డబ్బులపై ఆశపడ్డాడో వృద్ధుడు. దానికోసం ఎనిమిది మంది తోబుట్టువులతో గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే తనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారనే ఆవేశంతో 70 ఏండ్ల అన్న, 68 ఏండ్ల అక్కను కత్తితో విచక్షణారహితంగా ఇష్టమొచ్చినట్లుగా పొడిచాడు. ఈ దాడిలో అక్క మృతి చెందగా.. తీవ్రగాయాలైన అన్న చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. హైదరాబాద్‌లోని పాత మలక్‌పేటలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఎస్సై భరత్ కుమార్ కథనం.. పాత మలక్‌పేట డివిజన్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలోని వెంకటరమణ అపార్ట్ మెంట్‌లోని ఫ్లాట్ నంబర్ 101 లో నివాసం ఉండే రఘుపతి రావు–అనసూయ దంపతులకు ఐదుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు. విశ్రాంత రైల్వే ఉద్యోగి అయిన రఘుపతి రావు 2010లో చనిపోయారు. అప్పట్నుంచి అతని భార్య అనసూయకు పెన్షన్ డబ్బులు వస్తున్నాయి. అయితే తండ్రి పెన్షన్ డబ్బుల కోసం కుమారుడు మదన్‌రావు (63) తన తోబుట్టువులతో కొంతకాలంగా గొడవపడుతున్నాడు. తాజాగా బుధవారం రాత్రి కూడా తన తోబుట్టువులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో సహనాన్ని కోల్పోయిన మదన్‌రావు తన అక్క లక్ష్మీ(68), అన్న సుదర్శన్(70)పై దాడి చేశాడు.

లక్ష్మీని మదన్‌రావు పొట్టలో నాలుగుసార్లు, ఛాతిలో మూడుసార్లు బలంగా పొడవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సుదర్శన్ తీవ్రంగా గాయపడ్డారు. తన అన్న విచక్షణారహితంగా దాడి చేయడం చూసి భయపడిపోయిన మదన్‌రావు మరో సోదరి పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఘటనాస్థలికి చేరుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు మదన్‌రావును అరెస్టు చేశారు. తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను ఆస్పత్రికి, లక్ష్మీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ప్రాజెక్టు వల్ల సుమారు 35 లక్షల ప్రత్యక్ష పనిదినాలను సృష్టించటం ద్వారా ఉపాధి కల్పన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో సుమారు రూ.1332 కోట్లతో తిరుపతి–పాకాల–కాట్పాడి మధ్య 104 కిమీల మేర రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు ఆమోదం తెలిపింది.

రెండో లైను వల్ల సామర్థ్యం పెరిగి భారతీయ రైల్వే సేవల్లో విశ్వసనీయతను పెంచుతుంది. రెండు లైన్ల వల్ల ఈ మార్గంలో రైల్వే కార్యకలాపాల సులభతరం కానున్నాయి. అంతేకాకుండా రద్దీ కూడా తగ్గనుంది. దేశంలో రద్దీగా ఉండే మార్గాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఈ ప్రాజెక్టు అందించనుంది. ఈ ప్రాజెక్టు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవ భారత దార్శనికతను అనుగుణంగా ఉంది. ఇది ఈ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ద్వారా ఈ ప్రాంత ప్రజలను ''ఆత్మనిర్భర్''గా చేయనుంది. అంతేకాకుండా వారి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతుంది.

సమీకృత ప్రణాళిక ద్వారా సాధ్యమైన బహుళ–నమూనా అనుసంధానత కోసం పీఎం–గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌లో ఈ ప్రాజెక్టు ఉంది. ఇది ప్రజా రవాణాతోపాటు వస్తువులు, సేవల విషయంలో అంతరాయం లేని అనుసంధానతను అందిస్తుంది.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని మూడు జిల్లాల పరిధిలో ఉండే ఈ ప్రాజెక్టు వల్ల ప్రస్తుతం ఉన్న భారతీయ రైల్వే నెట్‌వర్క్ సుమారు 113 కిలోమీటర్ల మేర పెరుగనుంది.

తిరుమల వేంకటేశ్వర ఆలయానికి అనుసంధానతో పాటు ఈ ప్రాజెక్టు శ్రీ కాళహస్తి శివాలయం, కాణిపాకం వినాయక ఆలయం, చంద్రగిరి కోట వంటి ఇతర ప్రముఖ ప్రదేశాలను కలుపుతుంది. ఈ రైలు మార్గం దేశవ్యాప్తంగా ఉన్న యాత్రికులు, పర్యాటకులను ఆకర్షిస్తుంది.

ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 400 గ్రామాలు, 14 లక్షల జనాభాకు అనుసంధానత పెరుగుతుంది.

బొగ్గు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంట్, ఇతర ఖనిజాలు మొదలైన సరకు రవాణాకు ఇది ఒక ముఖ్యమైన మార్గం. సామర్థ్యాన్ని పెంచే పనుల ఫలితంగా 4 ఎంటీపీఏ (ఏడాదికి మిలియన్ టన్నుల్లో) అదనపు సరుకు రవాణా జరుగనుంది. రైల్వేలు పర్యావరణ అనుకూలమైనవి. దీనితో పాటు ఇంధన సమర్థవంతమైన రవాణా విధానం కావడం వల్ల, వాతావరణం పరంగా వివిధ లక్ష్యాలను సాధించడానికి, దేశ రవాణా ఖర్చును తగ్గించడానికి, చమురు దిగుమతిని (4 కోట్ల లీటర్లు) తగ్గించడానికి, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను (20 కోట్ల కిలోలు) తగ్గించడానికి సహాయపడుతుంది. ఇంకో రకంగా చెప్పాలంటే ఇది కోటి చెట్ల పెంపకానికి సమానం.

పెంచిన వంట గ్యాస్ ధరలు కేంద్రం వెంటనే తగ్గించాలి : గుమ్మడి సందీప్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం పేదలపై పన్నుల భారం మోపుతూ సంపన్నులకు రాయితీలు ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల పొట్ట కొట్టడం తప్పా పేదలను ఆదుకున్నది లేదని మండిపడ్డారు. ప్రధాని మోదీ దేశానికి అచ్చే దిన్ ఆయేగా అన్నాడు, కానీ పేదల నడ్డి విరిచే విధంగా నిత్యవసర వస్తువుల ధరలను నిరంతరం పెంచుతున్నట్లు దుయ్యబట్టారు.

పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.శిరోమణి మాట్లాడుతూ.. దేశంలో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, కార్మికులకు కనీస వేతనాలు లేవు, చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేవు, ఇవన్నీ సమకూర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ సంస్థలను అప్పగించి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. ఇప్పటికైనా పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల సహాయ కార్యదర్శి తేలే రాకేశ్, నాయకులు ధరావత్ సక్రు, బిక్కసాని భాస్కర్, గుమ్మడి సరోజిని, గుమ్మడి ఎర్రయ్య, మూతి ప్రకాశ్, పాయం ఆదిలక్ష్మి, పాయం రవి, గుమ్మడి రవి పాల్గొన్నారు.

మిర్యాలగూడలో కార్డెన్ సెర్చ్.. 61 వాహనాలు స్వాధీనం

నల్గొండ, ఏప్రిల్ 10::నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 60 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించగా కొంతమంది అనుమానిత వ్యక్తులను గుర్తించినట్లు తెలిపారు. అలాగే సరైన పత్రాలు లేని 57 బైక్‌లు, 4 ఆటోలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వలు వాహనాల నంబర్లు ట్యాంపరింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ వాహనాల ద్వారా ఎక్కడైనా నేరాలకు పాల్పడ్డారా, లేక వాహనాలు ఎక్కడ నుంచి వచ్చాయి అనే విషయాలు పూర్తి దర్యాప్తు అనంతరం వెల్లడి అవుతుందన్నారు. ఇకనుంచి కార్డెన్ సెర్చ్ నిరంతరం కొనసాగనున్నట్లు చెప్పారు. ప్రజలు అనుమానిత వ్యక్తులు కనిపించినా, ఎవరైనా వాహనాలపై అతివేగంగా సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నా అటువంటి వారి ఆచూకీ పోలీసులకు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు పీఎన్‌డీ ప్రసాద్, మోతీరాం, సోమ నరసయ్య, 12 మంది ఎస్ఐలు, 80 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శతావధాన సమాహ్వానము



హైదరాబాద్, ఏప్రిల్ 10: ఈనెల 12, 13, 14 తేదీలలో అనగా శని, ఆది,సోమవారాలు మూడు రోజులు సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయము, ప్రజ– పద్యం, అవధాన విద్యా వికాస పరిషత్ సంయుక్త నిర్వహణలో శతావధాన షడానన , శతావధాన పూర్ణచంద్ర డా. మారేపల్లి వేంకట రమణ పట్వర్ధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నూరు గారి సంపూర్ణ శతావధానము నిర్వహించబడునని. ఇట్టి కార్యక్రమానికి రసజ్ఞులైన సాహితీ పోషకులు, సాహితి పిపాసకులు, కవులు కళాకారులందరికి హృదయపూర్వక సాదర స్వాగతం పలుకుచు మన మంచిర్యాల వాస్తవ్యులు ప్రముఖ కవి రచయిత అవధాని డా. మారేపల్లి వేంకట రమణ పట్వర్ధన్ గారు సంపూర్ణ శతావధానము చేస్తున్న సందర్భముగా ప్రముఖ కవి రచయిత, అభినవ కవి కోకిల, తెలుగు భాష భూషణ్,సాహిత్య శ్రీ సమ్మాన్‌డా.దాసరి శ్రీనాథ్ గౌడ్ గారు వ్యక్తిగతంగా మరియు సంగీత సాహిత్య సుధా వాహిని సంస్థ పక్షాన డా. మారేపల్లి వేంకట రమణ పట్వర్ధన్ గారికి హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేస్తూ,డా. మారేపల్లి వేంకట రమణ పట్వర్ధన్ గారు మంచిర్యాలకే ఒక గొప్ప గర్వకారణమని,మంచిర్యాల సాహితీ మకుటం లో కలికి తురాయి అని కొనియాడారు.డా. మారేపల్లి వేంకట రమణ పట్వర్ధన్ గారు ఇంకా లెక్కకు మించిన అవధానాలనేకం చేయాలని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ.భగవంతుడు వారికి అన్నివిధాల సహకరించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూఇట్టి శతావధానకార్యక్రమము జరుగు వేదిక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం N. T. R కళామందిరం, నాంపల్లి హైదరాబాదులో అని గమనించ వలసినదిగా తెలియజేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.